సెక్టోరల్స్ ఎంపికకు అడుగులు

అనంతపురం ఎస్‌ఎస్‌ఏలో ఖాళీల భర్తీకి చర్యలు


శ్రీసత్యసాయి జిల్లాలో దరఖాస్తుల ఆహ్వానం



జిల్లా సమగ్రశిక్ష కార్యాలయం

అనంతపురం విద్య/ కొత్తచెరువు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్షలో ఏడాదిగా ఖాళీగా ఉన్న కీలకమైన సెక్టోరల్స్ పోస్టుల భర్తీకి అధికార యంత్రాంగం అడుగులు వేస్తోంది. గత జూన్‌లో ఆరు సెక్టోరల్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. వీటికి 171 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే నియామకాలను యంత్రాంగం పట్టించుకోలేదు, పైగా కొందరు టీచర్లను డెప్యుటేషన్ వేసుకున్నారు. దరఖాస్తులు స్వీకరించి నెలరోజులు కావస్తున్నా నియామకాలు జరపకపోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో ఎస్ఎస్ఏ అధికారులు సెక్టోరల్స్ నియామకాలకు అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా ఇదివరకే వచ్చిన దరఖాస్తులను పరిశీలించడానికి పది మందితో కమిటీని నియమించారు. అనంతపురం, గుత్తి డివిజన్‌ల డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి, గార్లదిన్నె ఎంఈఓ వెంకటరమణనాయక్, బుక్కరాయసముద్రం ఎంఈఓ లింగానాయక్, శ్రీనివాసరావు, హైస్కూల్ హెచ్ఎంలు శ్రీనివాసులు (పాలవెంకటాపురం), ఎర్రిస్వామి (గుండ్లపల్లి), రోషన్‌బాషా (వేపులపర్తి), ప్రహ్లాదనాయుడు (శింగానహళ్లి) పీఆర్‌పీ ప్రసాద్ (రాప్తాడు) లక్ష్మీశిరీషా (వెంకటాద్రిపల్లి)లను నియమించారు. ఈమేరకు ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ ఉత్తర్వులు ఇచ్చారు. ఈకమిటీ సెక్టోరల్ పోస్టుల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల మేరకు అర్హుల జాబితా తయారు చేస్తారు. అర్హత సాధించిన (మిగతా 6లో...)

రంగుతుంగ వైభవంగా..!



తుంగభద్ర జలాశయానికి భారీగా వరదనీరు చేరుతోంది. ఎగువన ఉన్న సింగటలూరు జలాశయం నుంచి 90 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. తుంగ జలాశయం నుంచి 70 వేలు, భద్ర జలాశయంల నుంచి 20 వేల క్యూసెక్కుల నీరు సింగటలూరుకు చేరుతోంది. అదే వరదను దిగువకు వదులుతున్నారు. దీంతో శనివారం సాయంత్రం 68 వేల క్యూసెక్కుల వరద నీరు తుంగభద్ర జలాశయానికి చేరుతోంది. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నందున వరద లక్ష క్యూసెక్కులకు పెరుగుతుందని భావిస్తున్నారు. దీంతో జలాశయానికి ఉన్న 33 క్రస్ట్‌గేట్లలో 26 గేట్లను 3 అడుగుల మేర ఎత్తి 84 వేల క్యూసెక్కుల నీటిని నదిలోకి వదులుతున్నామని బోర్డు ఎస్ఈ నారాయణనాయక్ తెలిపారు. జలాశయం గరిష్ఠ నీటి నిల్వలను ఈ ఏడాది 80 టీఎంసీలకు కుదించడంతో ప్రస్తుతం 78 టీఎంసీలను ఉంచి, మిగిలిన నీటిని నదికి వదులుతున్నారు. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల వారికి హెచ్చరికలు జారీ చేశారు. ఏపీ సరిహద్దులో హెచ్చెల్సీకి 1120 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నారు. - ఆంధ్రజ్యోతి, రాయదుర్గం

టీచర్లతో పాఠాలే చెప్పించాలి

డీఈఓ కార్యాలయం వద్ద యూటీఎఫ్ నిరసన



డీఈఓ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్న యూటీఎఫ్ నేతలు

అనంతపురం విద్య, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులతో నిత్యం పిల్లలకు పాఠాలు చెప్పించకుండా ఇతర పనులు చేయిస్తున్నారని యూటీఎఫ్ నేతలు మండిపడ్డారు. స్థానిక డీఈఓ కార్యాలయం వద్ద శనివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన సాగించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం మొదలై నెలన్నర రోజులైనా ఇప్పటికీ టీచర్ల నుంచి బోధన చేయించడంలేదన్నారు. నిత్యం ఏదో ఒకపని చెబుతూ యాప్‌లలో అప్‌లోడ్ చేయించడమే సరిపోయిందన్నారు. మరోవైపు ఏదో సమాచారం ఇచ్చి అత్యవసరం అంటూ యాప్‌లలో అప్‌లోడ్ చేయాలని టీచర్లను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం టీచర్లను బోధనకే ఉపయోగించుకోవాలని డిమాండ్ చేశారు. సెలవులు వాడుకోవడానికి నానా ఆంక్షలు పెట్టడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రమణయ్య, సరళ, చంద్రమోహన్, నాగేంద్ర, శ్రీనివాసులు, సంపత్‌కుమార్, ఆదిశేషయ్య, దస్తగిరి, చిత్తప్ప, పవన్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల ముఠా అరెస్టు

● పరారీలో ముగ్గురు 7

కార్గిల్ విజయం స్ఫూర్తిదాయకం: బీజేపీ

సహారాకు తాళం..!

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

దుర్గంలో రూ.3 కోట్ల వరకూ బకాయిలు

కళ్యాణదుర్గం, జూలై 26(ఆంధ్రజ్యోతి): 'పొదుపు చేస్తే అధిక వడ్డీ ఇస్తాం. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే ఐదేళ్ల తరువాత రెట్టింపు సొమ్ము ఇస్తాం' అని ప్రచారం చేసి, భారీగా సొమ్ము వసూలు చేసిన సహారా ఇండియా పరివార్.. తమను నిండా ముంచేసిందని పేదలు ఆవేదన చెందుతున్నారు. కళ్యాణదుర్గంలో సుమారు 300 మంది బాధితులకు రూ.3 కోట్ల దాకా రావాల్సి ఉంది. మెచ్యూర్ అయిన ఫిక్స్‌డ్ డిపాజిట్ సొమ్ము కోసం మూడు నెలల నుంచి ఖాతాదారులు పట్టణంలోని వినియోగదారుల సేవాకేంద్రం చుట్టూ తిరుగుతున్నారు. ఒత్తిడి భరించలేక అక్కడి సిబ్బంది కార్యాలయానికి తాళం వేసుకుని, సెల్‌ఫోన్‌లను స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. దీంతో బాధితులు పట్టణ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. తమకు 35 మంది ఫిర్యాదు చేశారని, విచారిస్తున్నామని సీఐ యువరాజ్ తెలిపారు.



సీఐ యువరాజుకు ఫిర్యాదు చేస్తున్న ఖాతాదారులు

కష్టార్జితం పోగొట్టుకున్న పేదలు

కళ్యాణదుర్గంలో సహారా ఇండియా పరివార్ బ్రాంచిని 2018లో ప్రారంభించారు. అధిక వడ్డీ పేరిట చిరు వ్యాపారులు, తోపుడు బండ్లవ్యాపారులు, రైతులు వంటి పేద, మధ్యతరగతి వారి నుంచి డిపాజిట్లు స్వీకరించారు. కొందరు ప్రతి రోజు, మరికొందరు వారం వారం చిన్న చిన్న మొత్తాల్లో జమ చేశారు. ఐదేళ్లకు రెట్టింపు సొమ్ము అనడంతో మరికొందరు ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 300 మందికి పైగా బాధితులు ఉన్నారు. ఇక్కడ పనిచేసే ఆంజనేయులు, సలామ్ అనే ఇద్దరు ఉద్యోగులు స్థానికులు కావడంతో ఎక్కువ మంది నమ్మి, పొదుపు చేశారు. ఇప్పుడు ఆ ఇద్దరు ఉద్యోగుల ఫోన్లు స్విచాఫ్ వస్తున్నాయి.

పొలం అమ్మి రూ.27 లక్షలు పెట్టాను..



పొలం అమ్మిన డబ్బులు రూ.27 లక్షలు తీసుకువచ్చి సహారా బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాము. ఐదేళ్ల తరువాత రెండింతలు ఇస్తామని చెప్పారు. అలా అని బాండ్ కూడా ఇచ్చారు. ఐదేళ్లు దాటిన తరువాత బ్యాంకు దగ్గరకు వెళితే ఆన్‌లైన్ చేశామని, డబ్బు వస్తుందని కాలం గడిపారు. చివరకు బ్యాంకుకు తాళం వేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశాను. మాకు న్యాయం చేయాలి.

- బోయ అనంతమ్మ, తోపుడు బండి వ్యాపారి, కళ్యాణదుర్గం

ఫీల్డ్ అసిస్టెంట్ల డిష్యుం.. డిష్యుం

జాబ్ కార్డుల విషయంలో పరస్పరం దాడులు

ఐదుగురిని తొలగించిన ఎంపీడీఓ

బుక్కరాయసముద్రం, జూలై 26(ఆంధ్రజ్యోతి): నకిలీ జాబ్ కార్డుల విషయంగా ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్‌ల మధ్య చోటు చేసుకున్న వివాదం గొడవకు దారితీసింది. బుక్కరాయసముద్రం గ్రామ పంచా యతీలో ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు 3700 ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీడీపీలో ఫీల్డ్‌అసిస్టెంట్ ఉద్యోగం కోసం తీవ్ర పోటీ నెలకొంది. దీంతో గ్రామంలో ఐదుగురిని ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా ఎంపిక చేసి, జాబ్ కార్డులను వీరికి సమానంగా పంచారు. అయితే శుక్రవారం సాయంత్రం బాలు అనే ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామ పంచాయతీ లోని పలు కాలనీలకు చెందిన 100 జాబ్ కార్డులను కొత్తగా ఎక్కించా లని జాబితాను ఏపీఓకు ఇచ్చాడు. దీనిపై మరో ఫీల్డ్ అసిస్టెంట్ అనేరి నారాయణస్వామి అభ్యంతరం తెలిపాడు. ఈక్రమంలోనే నకిలీ జాబ్‌కార్డుల వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తోందని బాలు, మరో ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్‌తో వాదనకు దిగాడు. శనివారం రెడ్డిపల్లి గ్రామం వద్ద బాలు, సురేష్ ఉపాధి పనులు చేయిస్తుండగా ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణస్వామి అక్కడి వెళ్లి మరో మారు వారితో వాదనకు దిగాడు. ఈక్రమంలో మాటా మాట పెరిగి పరస్పరం దాడికి దిగారు. తమపై దాడి చేసి గాయపర్చారని నిరసన తెలుపుతూ బాలు, సురేష్‌లు కూలీలతో కలిసి అనంతపురం- తాడిపత్రి రహదారిపై రెడ్డిపల్లి గ్రామం వద్ద బైఠాయించారు. ఘటనా స్థలానికి సీఐ పుల్లయ్య చేరుకుని ఆందోళనకారులకు సర్ది చెప్పి ధర్నా విరమింపజేశారు. అనంతరం సురేష్, బాలు అనే ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు తమపై అనేరి నారాయణస్వామి, మరికొందరు దాడి చేశారని స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా ఫీల్డ్ అసిస్టెంట్ వివాదంలో రెండు కూలాల మధ్య చిచ్చుపెట్టేందుకు కొంత మంది వైసీపీ కోవర్టులు ప్రయత్నించారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. గొడవలు, అవినీతి ఆరోపణల నేపథ్యంలో బుక్కరాయసముద్రం ఫీల్డ్ అసిస్టెంట్లు గోగాకు చితంబరి, చెరుకురి నారాయణస్వామి, సురేష్, బాల, అనేరి నారాయణస్వామిని తొలగించినట్లు ఎంపీడీఓ సాల్మన్‌రాజు తెలిపారు.



కూలీలతో కలిసి ధర్నా చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కసాపురంలో వైభవంగా

శేష వాహనోత్సవం



కసాపురం స్వామివారికి ప్రత్యేక అలంకరణ (7లో...)

చివరికి నీరు..!

మిడ్ పెన్నార్ ఐదో కాలువకు వేగంగా మరమ్మతులు

శింగనమల, జూలై 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. దీంతో చివరి ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



చివరి ఆయకట్టు భూముల వరకు కాలువలో పూడక తీసిన దృశ్యం

శింగనమల మండల పరిధిలో మిడ్ పెన్నార్ ఐదో దక్షిణ కాలువ మరమ్మతులకు వైసీపీ పాలనలో నయాపైసా రాకపోవడంతో ముళ్ల కంపలు, పూడిక పేరుకుపోయి తూములకు గండ్లు పడ్డాయి. దీంతో చివరి ఆయకట్టు భూములకు చుక్క నీరు చేరిన సందర్భం లేదు. కాలువ పొడవునా కంపచెట్లు పెరిగి పూడికతో నిండిపోయింది. కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే మిడ్‌పెన్నార్ ఐదో కాలువ కంప చెట్లు తొలగింపు, పూడిక తీయడానికి, తూముల వద్ద గండ్లు పూడ్చడానికి నిధులు మంజూరు చేసింది. పనులు చివరి దశకు చేరడంతో ఈసారి చివరి ఆయకట్టుకు నీరు చేరుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరి సాగు..

చివరి ఆయకట్టుకు నీరు చేరితే రైతుల వరి సాగు చేస్తారు. మిడ్‌పెన్నార్ ఐదో దక్షిణ కాలువ కింద శింగనమల మండలంలోని కల్లుమడి నుంచి చివరి ఆయకట్టు సలకంచెరువు వరకు 16 నుంచి 28వరకు కాలువలు ఉన్నాయి. అంతకు ముందు చివరి ఆయకట్టు వరకు నీరు చేరుతుండేది. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో చివరి ఆయకట్టు వరకు నీరు వెళ్లలేకపోయింది. కాలువ 12 కిలో మీటర్ల పొడవునా తూముల వద్ద గండ్లు పడ్డాయి. కాలువ పొడవునా కంపచెట్లు పెరగడంతో చివరి ఆయకట్టు వరకు నీరు చేరడం కష్టమయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కాలువ కమిటీ ఏర్పాటు చేసింది. తూముల మరమ్మతులు, కంపచెట్ల తొలగింపు, పూడికను తీయడానికి నిధులు మంజూరు చేయడంతో ఆయకట్టుకు నీరు చేరుతుందని రైతులు ఆశలు పెట్టుకున్నారు.



గుమ్మేపల్లి వద్ద కాలువ తూము

చివరి దశలో ఉన్నాయి..



చింతమేకలపల్లి వద్ద కాలువలో కంపచెట్లు, పూడిక తొలగింపు

మిడ్‌పెన్నార్ ఐదో దక్షిణ కాలువ కింద 16వ కాలువ నుంచి 28వ కాలువ వరకు కంపచెట్ల తొలగింపు, పూడిక తీత, తూముల వద్ద షెట్టర్లు వేయడానికి రూ.25 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. కాలువ పొడవునా సైడ్ వాల్స్, తూముల వద్ద గండ్లు, పిల్ల కాలువల మరమ్మతులు చేయడానికి ప్రతిపాదనలు పంపాం. మొదటి విడత నిధులు పూర్తయిన తరువాత రెండో విడతలో నిధులు వస్తాయని ఉన్నతాధికారులు తెలిపారు.

- సురేంద్రరెడ్డి, ఏఈ, నీటిపారుదల శాఖ

పిల్ల కాలువను బాగు చేయాలి



నాకు 17వ కాలువ కింద మూడు ఎకరాల భూమి ఉంది. కాలువ నీటితో పంటలు సాగు చేస్తున్నాను. కాలువ పొడవునా మరమ్మతుల చేస్తున్నారు. భూములకు పోయే కాలువ చాలా సంవత్సరాల నుంచి మరమ్మతులు చేయలేదు. దీంతో మా భూములకు ఆర కిలో మీటర్ వరకు కాలువ పూడిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం పిల్ల కాలువల మరమ్మతులకు నిధులు కేటాయించాలి.

- బోయ రామాంజినేయులు, రైతు, కల్లుమడి

చివరి వరకూ ఇస్తాం...



వైసీపీ పాలనలో ఏనాడూ చివరి ఆయకట్టు భూములకు, సలకంచెరువు వరకు నీరు చేరలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. వచ్చిన నిధులతో చివరి ఆయకట్టు భూములు నాయనవారిపల్లి వరకు కాలువలో కంప చెట్లు, పూడిక తీసి, తూములను మరమ్మతులు చేయించాం. ఖచ్చితంగా చివరి ఆయకట్టు వరకు నీటిని తీసుకెళ్లాలని నిర్ణయించాం.

- కుమ్మెత చంద్రాయుడు, 20-28 కాలువల అధ్యక్షుడు, నిదనవాడ

మరమ్మతులతోనే నీరు..



కాలువలో కంపచెట్లు తొలగించి, పూడిక తీయడానికి నిధులు మంజూరయ్యాయి. వచ్చిన నిధులతో పనులు చేయడంతో భూములకు నీరు సాఫీగా చేరుతుంది. తూముల వద్ద గండ్లు, కాలువ పొడవునా సైడ్‌వాల్స్ సక్రమంగా లేవు. పిల్లకాలువలు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. దాంతో కాలువ నీరు వృథా అయ్యే పరిస్థితి ఉంది. తూముల మరమ్మతులకు, సైడ్‌వాల్ నిర్మాణాలకు, పిల్లకాలువల మరమ్మతులకు ప్రత్యేక నిధులు కేటాయిస్తే కాలువలకు శాశ్వత మార్గం దొరుకుతుంది.

- ఓబులరాజు, 16-19 కాలువల అధ్యక్షుడు, కల్లుమడి

హనుమాన్ దర్శన్ బస్సులు ప్రారంభం



హనుమాన్ దర్శన్‌కు వెళ్తున్న బస్సులు

అనంతపురం టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హనుమాన్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా శనివారం బస్సు సర్వీసులు ప్రారంభమయ్యాయి. తొలి శనివారం 84మంది ప్రయాణికులతో అనంతపురం డిపో నుంచి రెండు బస్సులు మురడి, నేమకల్లు, కసాపురం ఆలయాల సందర్శన కోసం బయలుదేరి వెళ్లాయి. అనంతపురం డీఎం నాగభూపాల్ టెంకాయ కొట్టి బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో బస్టాండ్ మేనేజర్ కేఎస్ మూర్తి, ఎస్‌టీఐ రామాంజనేయులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

అనంతపురం కలెక్టరేట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) ఈనెల 28న కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు..

అరచేతిలో పురసేవలు

● పురమిత్రతో మొబైల్ నుంచే అన్ని వ్యవహారాలు

● అందుబాటులోకి 150 రకాల సేవలు

(వివరాలు 6లో..)

● కుక్క బతుకు..!



ఎట్లబ్బా దాటేదీ..! తగిల్తే సచ్చి ఊరుకుంటా..!



ఓ సారూ.. రొంత రోడ్డు దాటిచ్చి పుణ్యం కట్టుకుంటారా..? కుంటిదాన్ని..



కొంచెం ఆగు.. అందిరినీ ఆపేస్తాను..



భయపడాకు.. నేనున్నా కదా.. నెమ్మదిగా దాటుకో..



థ్యాంక్సు సారూ.. ముందరుండి దాటిస్తాండావు..! నీ పెండ్లాం పిల్లోళ్లు సల్లగుండల్లా..!



ఇదిగో.. అక్కడ పుట్‌పాత్ ఎక్కు.. ఇంగేం భయం లేదు..!



ఓ సారూ.. పోతాండావా..? ఆకలైతాంది.. తిన్నీకి ఏమైనా కొనీగుడుదూ..!



ఇంటికాడైతే కడుపు నిండా బువ్వ పెడుదును..! ఇదిగో.. బిస్కెట్లు తిను..!



దిష్టి తగిలీని సామీ.. అట్ల సూత్తాండారూ..!

(అనంతపురం నగరంలోని శ్రీకంఠం సర్కిల్‌లో తచ్చాడుతూ ఉంటుంది ఈ వీధి శునకం. ఏదో వాహనం ఢీకొని దీని వెనక కాళ్లు రెండూ సచ్చుపడిపోయాయి. ఆకలి తీర్చుకునేందుకు రోడ్డు దాటుతూ.. ట్రాఫిక్‌లో నిత్యం వాహనాలకు అడ్డొస్తుంటుంది. ట్రాఫిక్ పోలీసులు ఇలా సాయం చేశారు)

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, అనంతపురం

అరచేతిలో పురసేవలు

● పురమిత్రతో మొబైల్ నుంచే అన్ని వ్యవహారాలు ● అందుబాటులోకి 150 రకాల సేవలు

ధర్మవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రజల చెంతకే పరిపాలనను తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇప్పటికే వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో పలు రకాల సేవలను ప్రజల చేతిలోకి తెచ్చింది. పురపాలక సేవలను కూడా పౌరుల చెంతకు తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. పట్టణాలు, నగరాల్లో ఉండే ప్రజలకు పౌరసేవలను సులభతరం చేయడం కోసం సేవామిత్ర మాదిరిగా పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పట్టణ వాసులు పౌర సేవల కోసం మున్సిపల్ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సివస్తోంది. నగరాల్లో ఈ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. మున్సిపాలిటీలకు పన్నులు కట్టాలన్నా, చార్జీలు చెల్లించాలన్నా, ఏదైనా సమస్యపై ఫిర్యాదు చేయాలన్నా గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాలి. వార్డు సచివాలయాలు వచ్చిన తరువాత వారంతా స్థానిక సచివాలయాల దగ్గరకు వెళుతున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రాష్ట్ర మున్సిపల్ శాఖ పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా అనేక రకాల డిజిటల్ సేవలు అందుబాటులోకి తెచ్చింది.



రోజుల వ్యవధిలోనే పరిష్కారం

రోజుల వ్యవధిలోనే సమస్యల పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటారు. సమస్యను పంపేందుకు యాప్‌లో ఫీచర్స్ కూడా పొందుపరిచారు. మనచుట్టూ ఉన్న సమస్యను ఫొటో తీసి, వాయిస్ రికార్డుతో టైప్ చేసి పంపించే విధంగా యాప్‌ను రూపొందించారు. పంపిన సమస్య.. సమాచారం నేరుగా సంబంధిత విభాగాధికారికి వెళుతుంది. పరిష్కారం చూపేందుకు కనీసం మూడు నుంచి 15 రోజులు లేదా 30 రోజుల వ్యవధి నిర్ణయించారు. సమస్య తీవ్రత బట్టి పరిష్కారం చూపిస్తారు.

యాప్‌ను ఎలా ఇన్‌స్టాల్ చేసుకోవాలంటే..

స్మార్ట్ ఫోన్ వాడేవారు గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి పురమిత్ర అని టైప్ చేస్తే యాప్ ప్రత్యక్షమవుతుంది. దాన్ని మొబైల్‌లోకి ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆ తరువాత ఓపెన్ బటన్ క్లిక్ చేసి యాప్‌ను ఓపెన్ చేసుకోవాలి. మున్సిపాలిటీ, కార్పొరేషన్‌ను ఎంపిక చేసుకోవాలి. వాటి పరిధిలోని సచివాలయాన్ని ఎంచుకోవాలి. ఆ తరువాత పేరు మొబైల్ నంబర్ ఎంటర్ చేయాలి. ఎంటర్ చేసిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని ఎంటర్ చేస్తే యాప్‌లో సేవలకు సంబంధించిన ఆప్షన్లు కనిపిస్తాయి. పబ్లిక్ హెల్త్, మొదలు రెవెన్యూ సేవల వరకూ 8 విభాగాలు కనిపిస్తాయి. మన సమస్య ఏ విభాగానికి సంబంధించినదో.. ఆ విభాగాన్ని టచ్ చేస్తే అందులో పలు రకాల సేవలకు సంబంధించిన ఆప్షన్స్ కనిపిస్తాయి. వాటిని క్లిక్ చేసి మన సమస్యను ప్రభుత్వానికి తెలియజేయవచ్చు.



మున్సిపల్ కార్యాలయం

యాప్‌ను సద్వినియోగం చేసుకోండి

మున్సిపాలిటీలో ప్రభుత్వం పురమిత్రయాప్‌ను తీసుకువచ్చింది. ప్రజలు ఈ యాప్‌ను స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని దాని ద్వారా సమస్యను తెలపవచ్చు. ఏ సమస్యపై ఫిర్యాదు చేస్తారో అది నేరుగా సంబంధిత అధికారుల వద్దకు చేరుతుంది. దీంతో సమస్యను పరిష్కరిస్తాం. ఇప్పటికే సచివాలయాల్లో ఈ యాప్‌పై ప్రచారం చేశాం. ప్రజలు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

- రాజేశ్వరి, మేనేజర్, ధర్మవరం మున్సిపాలిటీ

యాప్‌ద్వారా 150 సేవలు

పురమిత్ర యాప్ ద్వారా మొత్తం 150 సేవలు అందుబాటులో తెస్తున్నారు. రెవెన్యూ, ప్రజారోగ్యం, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు సంబంధించిన 150 రకాల సేవలు అందుబాటులోకి తెచ్చారు.

● పన్ను చెల్లింపులు, కుళాయి చార్జీల చెల్లింపులు, జనన, మరణ, ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు, వివాహ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకునే సదుపాయం ఈ యాప్‌లో కల్పించారు.

● తమ ఆవాసాల వద్ద ప్రజలు ఎదుర్కొనే రోజువారీ సమస్యలపై అధికారులకు ఎప్పటికప్పుడు ఫిర్యాద చేయవచ్చు. తాగునీటి సమస్య, విద్యుత్ అంతరాయాలు, పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీ, రహదారుల సమస్యలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేసే సదుపాయం ఉంది.

● పారిశుధ్య నిర్వహణకు సంబంధించి దోమలు, వీధికుక్కలు, శ్మశాన వాటికలు, బయో, మెడికల్ వ్యర్థాల తొలగింపు, వీధులను శుభ్రంచేయకపోవడం, గుర్తుతెలియని మృతదేహాలు, సామూహిక మరుగుదొడ్ల నిర్వహణ, రోడ్ సైడ్ ఆహార కల్తీ, గార్బేజ్ బిన్‌ల ఏర్పాటు, చెత్త తొలగింపు వంటి మొత్తం 53 రకాల సేవలు అందుబాటులో ఉంచారు.

● టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి పార్కింగ్, అనధికార ప్రకటనలు, బోర్డులు, హోర్డింగులు, ట్రీగార్డులు, అనధికార కట్టడాలు, కమ్యూనిటీ హాళ్ల దుర్వినియోగం, ప్రమాదకరంగా ఉన్న తీగలు, సెల్ టవర్లు, మార్కెట్ సమస్యలు, ఫుట్‌పాత్‌ల నిర్వహణ, ఆక్రమణ వంటి 13 రకాల సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చు.

● నీటి సరఫరాకు సంబంధించి 4 సేవలు, పట్టణ పేదరిక నిర్మూలనకు సంబంధించి 12, పాలనా పరమైనవి 6, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 16, వీధి దీపాల సమస్యపై 3, రెవెన్యూ విభాగానికి సంబంధించి 12 సేవలు ఈ యాప్‌లో అందుబాటులోకి తెచ్చారు. వీటికి సంబంధించిన సమస్య తలెత్తినప్పుడు ఇంటి నుంచే ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

సబ్ డివిజన్ చేసే అధికారం లేదు

జిల్లా రెవెన్యూ అధికారి మలోల



డీఆర్‌ఓ మలోల

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అనంతపురం కలెక్టరేట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఏదైనా భూమి సబ్‌డివిజన్ చేసే అధికారం ఏ రెవెన్యూ అధికారికీ లేదు అని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ)మలోల స్పష్టం చేశారు. రెవెన్యూ అంశాలపై డీఆర్‌ఓ 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పలు విషయాలు తెలియజేశారు.

ప్రశ్న : ఫ్రీ హోల్డ్ భూముల పరిస్థితి ఏంటి..?

జవాబు : జిల్లాలో 36వేల ఎకరాల వరకు భూములను ఫ్రీహోల్డ్‌లో ఉంచారు. వాటిలో 120 ఎకరాల భూములు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు గుర్తించాం. ప్రభుత్వం మరో రెండు నెలల వరకు నిషేధం విధించింది.

ప్రశ్న : ఖాళీగా ఉన్న తహసీల్దార్ల స్థానాలపై చర్యలు..?

జవాబు : జిల్లాలో దాదాపు ఏడెనిమిది తహసీల్దార్ల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఆ స్థానాల భర్తీ విషయంలో చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్లను ఇన్‌చార్జి తహసీల్దార్లుగా నియమించాం.

ప్రశ్న : సబ్ డివిజన్ విషయంలో నెలకొంటున్న వివాదాలకు పరిష్కారం ఏమిటి..?

జవాబు : భూముల భాగాల విభజనకు సంబంధించి సబ్ డివిజన్ కీలకమవుతుంది. ఎవరైనా సబ్ డివిజన్ చేయమని కోరితే తహసీల్దార్ సర్వేయర్‌కు ఆదేశిస్తారు. తొలుత విలేజ్ సర్వేయర్ సంబంధిత భూమిని సర్వే చేస్తారు. మండల సర్వేయర్ స్క్రూటినీ చేస్తారు. ఓకే చేశాక తహసీల్దార్ అప్రూవల్ చేస్తారు. నేరుగా ఏ రెవెన్యూ అధికారికీ సర్వే చేసే అధికారం లేదు.

ప్రశ్న : మిగులు భూముల ఫైళ్ల పరిష్కారం కాలేదనే ఆరోపణలపై ఏమంటారు..?

జవాబు : అలాంటిదేమీ లేదు. మిగుల భూములకు సంబంధించి సరైన డాక్యుమెంట్లు, రికార్డులు ఉంటే తప్పకుండా పరిష్కారమవుతుంది. వెబ్ ల్యాండ్ కరెక్షన్ ప్రక్రియ ద్వారా అధికారులు సమస్యను పరిష్కరిస్తున్నారు. దాదాపు 150 ఫైల్స్ వరకు పరిష్కరించాం.

ప్రశ్న : రీ సర్వే ఎందుకు ఆలస్యమవుతోంది..?

జవాబు : ప్రతి మండలంలోనూ ఒక గ్రామాన్ని పైలెట్‌గా తీసుకుని రీ సర్వే చేపడుతున్నాం. రైతుల పొలాల సరిహద్దు విషయాల్లోనే వివాదాలు ఉన్నాయి. సాగులో ఉన్న వారికి లేదా సరైన డాక్యుమెంట్లు ఉన్న వారికే న్యాయం జరుగుతుంది. కొన్నిచోట్ల సంబంధిత గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. త్వరలోనే వేగవంతం చేస్తాం.

ప్రశ్న : రెవెన్యూలో అవినీతిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు : తహసీల్దార్ కార్యాలయాలు, రెవెన్యూ విషయాల్లో అవినీతి జరిగితే ఉపేక్షించం. ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. గతంతో పోల్చితే ప్రజల్లోనూ అవగాహన పెరిగింది. కిందిస్థాయిలో ఎవరైనా తప్పు చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.

సెక్టోరల్స్ ఎంపికకు అడుగులు

(5వ పేజీ తరువాయి)

వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారిని సెక్టోరల్స్‌గా ఎంపిక చేయనున్నారు.

దరఖాస్తు చేసుకోండి

శ్రీసత్యసాయి జిల్లాలోని ఏపీ సమగ్రశిక్ష సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ క్రిష్టప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్(1), ఆల్టర్నేటివ్ స్కూల్ కో ఆర్డినేటర్(1), ప్లానింగ్ అండ్ ఎంఐఎస్ కో ఆర్డినేటర్ (1), 4.కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్(1), అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (2), అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ జనరల్(1), అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్(1), అసిస్టెంట్ గర్ల్‌చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(1), అసిస్టెంట్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్(1) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటికి దరఖాస్తు చేసుకోవడానికి శ్రీ సత్యసాయి జిల్లాలో పని చేస్తున్న స్కూల్ అసి స్టెంట్‌లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు అర్హులన్నారు. ఈనెల 28నుంచి ఆగస్టు 4లోగా దరఖాస్తులను బుక్కపట్నంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాల కోసం సమగ్రశిక్ష వెబ్‌సైట్ డీఈఓఎస్ఎస్ఎస్.డీఎల్ఓజీఎస్‌పీఓటీ.కమ్‌ను చూడాలన్నారు.

వీరే అర్హులు..

ఈ పోస్టులకు శ్రీసత్యసాయిజిల్లాలో పనిచేస్తున్న వారు మాత్రమే అర్హులు. సస్పెండ్ అయిన వారు, గతంలో ఏపీ సమగ్రశిక్ష కార్యాలయంలో పనిచేస్తూ సరెండర్ అయినవారు అనర్హులు. నిర్ణీత వయస్సు 28-07-25 నాటికి 55 సంవత్సరాలోపు ఉండాలి. ప్రతి పోస్టుకు విడివిడిగా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ధ్రువీకరణ పత్రాలు జత పరచని దరఖాస్తులను తిరస్కరిస్తామని డీఈఓ తెలిపారు.

నేర రహిత జిల్లాగా మార్చడమే ధ్యేయం

● శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): నేర రహిత జిల్లాగా మార్చడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. అర్ధవార్షిక నేరసమీక్ష సమావేశంలో భాగంగా శనివారం ఆమె బెస్టు పోలీసింగ్‌పై మాట్లాడారు. జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే నేరాల సంఖ్య 27శాతం తగ్గిందన్నారు. హత్యలు హత్యాయత్నాలు 36 శాతం తగ్గాయని, 41 శాతం క్రైం రేట్ తగ్గిందన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులు, హత్యకేసులు, పోక్సో, అత్యాచారం, డెకాయిట్ కేసులు, వాహనాల దొంగతనం, మిస్సింగ్, చీటింగ్ తదితర కేసులలో దర్యాప్తు, రికవరీ గురించి పవర్‌పాయంట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో నేరాల నియంత్రణకు ఏడాదికాలంగా ప్రత్యేక పటిష్టమైన ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామన్నారు. రోడ్డుప్రమాదాలు, వైట్‌కాలర్ నేరాలను తగ్గించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సత్యసాయిబాబా జయంతి ఉత్సవాలకు దేశవిదేశాల నుంచి భక్తులు వస్తారని, అందుకనుగుణంగా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నామన్నారు. రోడ్డుప్రమాదాలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ట్రాన్స్‌పోర్టు అధికారి కరుణాసాగర్‌రెడ్డి వివరించారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

ప్రతిభకు పురస్కారాలు

వివిధ కేసులను త్వరగా ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన 57 మంది పోలీసు సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలను అందచేశారు. కార్యక్రమం లో అడిషనల్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్ సృజనా, డీడీఓ రాంనాయక్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, జిల్లా ఫైర్ ఆఫీసర్ మాధవనాయుడు, అడిషనల్ పీపీలు ఏపీపీలు లక్ష్మీనారాయణ, పద్మజ, ఈగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, డీఎస్పీలు విజయ్‌కుమార్, నరసింగప్ప, శివనారాయణ, మహేష్, అదినారాయణ, శ్రీనివాసులు జిల్లాలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధి కోసమే పీ-4

● కలెక్టర్ టీఎస్ చేతన్

లేపాక్షి, జూలై 26(ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధి కోసమే పీ-4ను ప్రభుత్వం అమలు చేస్తోందని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. కంచిసముద్రంలో శనివారం పీ-4పై నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పేదల జీవితాల్లో మార్పు తీసుకురావాలని అధికారులకు సూచించారు. గ్రామంలోని విద్యావంతులు, ఎన్ఆర్ఐలు, ఉపాధ్యాయులు, అన్నివర్గాలవారు ఇందులో భాగస్వాములు కావాలని, పేదరిక నిర్మూలనకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. బంగారు కుటుంబాల దత్తత మార్గదర్శకుల ఎంపిక, లబ్ధిదారుల నమోదు వంటి కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్య, ఆరోగ్య, ఆర్థిక రంగాల్లో వెనుకబడిన వారిని గుర్తించి, చేయూతనివ్వాలని, వారిని ఉన్నత స్థానాలకు తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సౌజన్య లక్ష్మి, ఎంపీడీఓ నరసింహమూర్తి, సర్పంచ్ గంగలక్ష్మమ్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

బదిలీ టీచర్ల జీతాలపై ఇంత నిర్లక్ష్యమా..?

● ఏపీటీఎఫ్ జిల్లా నేతల మండిపాటు



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల వెంకటేష్

అనంతపురం విద్య, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీ అయిన వందలాది మంది ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం ఏమిటని ఏపీటీఎఫ్ జిల్లా నేతలు మండిపడ్డారు. శనివారం ఉపాధ్యాయ భవన్‌లో ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి పాపిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాయల వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, పూర్వపు రాష్ట్రకార్యదర్శి నరసింహులు తదితరులు మాట్లాడుతూ.. జూన్, జూలై నెలల జీతాలు ఇవ్వకపోవడంతో అనేకమంది టీచర్లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. క్యాడర్‌స్ట్రెంత్ తేలలేదని, పొజిషన్ ఐడీలు కేటాయించలేదని చెబుతూ జీతాలు ఇవ్వకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బదిలీ టీచర్లందరికీ జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బోధన చేయకుండా నానా యాప్‌ల పేర్లతో టీచర్లకు ఆటంకం కలిగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు నాగరాజు, మోహన్‌రెడ్డి, నరేష్‌కుమార్, సర్దార్‌వలి పాల్గొన్నారు.

శాంపుల్స్

పెద్దాస్పత్రికి పెరిగిన రోగుల తాకిడి

కిటకిటలాడుతున్న పరీక్ష కేంద్రాలు

వైద్యపరీక్షల కోసం తప్పని నిరీక్షణ

తీరని 'సెంట్రల్'ల్యాబ్ కష్టాలు



కిటకిటలాడుతున్న పెథాలజీ, బయోకెమిస్ట్రీ శాంపిల్స్ సేకరణ కేంద్రం

రోగులతో కిక్కిరిసిన మైక్రో బయాలజీ రక్తపరీక్షల విభాగం



అనంతపురం వైద్యం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే రోగులకు కష్టాలు తప్పడంలేదు. 12వ ఓపీలోని మూడు ఇరుకైన గదుల్లోనే రక్తపరీక్షల ప్రక్రియను నిర్వహిస్తున్నారు. మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, పెథాలజీ విభాగాలను ఒక్కో గదిలో ఏర్పాటుచేసి రోగులనుంచి శాంపిల్స్(రక్తం, మూత్రం ఇతర నమూనాలు) సేకరిస్తున్నారు. రోజు 2వేల మంది వరకు ఓపీకి వస్తున్నారు. వారిలో 50శాతం వరకు పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్లు రాస్తున్నారు. ఈ నేపథ్యంలో 12వ ఓపీలోని రక్తపరీక్షల విభాగంలో రోగులకు గంటల తరబడి నిరీక్షణ తప్పడంలేదు. డాక్టర్ సూచించిన పరీక్షలకు శాంపిల్ ఇవ్వాలంటే చుక్కలు కనబడుతున్నాయని రోగులు వాపోతున్నారు. అనంతపురం పెద్దాస్పత్రిలో వైద్య సేవలు బాగున్నాయన్న ప్రచారం జిల్లా సరిహద్దులు దాటడంతో ఇతర జిల్లాల రోగులు కూడా ఇక్కడికి వస్తున్నారు. ముఖ్యంగా మోకాళ్ల నొప్పి, హృద్రోగం, అపెండిసైటిస్ తదితర బాధితులు తరలివస్తున్నారు. ఈ క్రమంలో 12వ ఓపీలోని రక్తపరీక్షల విభాగంలో రోజుకు 300నుంచి 500వరకు రోగులు సంఖ్య నమోదవుతోంది. వారందరికీ శాంపిల్స్ తీసేందుకు ల్యాబ్ టెక్నీషియన్లు నానా తంటాలు పడుతున్నారు. కొన్ని పరీక్షలు అక్కడికక్కడే నిర్వహించినా ఎక్కువ పరీక్షల కోసం ల్యాబ్స్‌కు పంపాల్సి వస్తోంది.

అన్నీ ఒకేచోట

రక్తపరీక్షలను మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, పెథాలజీ ఈ మూడు విభాగాల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. సీబీపీ, ఏఈసీ, ఈఎస్ఆర్, బీటీసీటీ తదిర రక్తపరీక్షలు పెథాలజీ విభాగంలో చేస్తారు. బయో కెమిస్ట్రీ ఆధ్వర్యంలో ఆర్‌బీఎస్, యూరియా, సీరం క్రియాటినైన్, ఎల్ఎఫ్‌టీ, లిపిడ్, ఫ్లూయిడ్ అనాలసిస్, ఎలెక్ట్రోలైట్స్, కాల్షియం, యూరిక్ యాసిడ్, థైరాయిడ్ తదితరాలు చేస్తారు. కల్చర్, హెచ్‌బీఎస్ఏజీ, హెచ్‌సీవీ, వీడీఆర్ఎల్, వైడల్, డెంగీ, సీఆర్పీ, ఆర్ఏ, ఏఎస్‌ఓ వంటి పరీక్షలను మైక్రో బయాలజీ విభాగంలో నిర్వహిస్తారు. ఈ మూడు విభాగాలను చిన్నగదుల్లో ఏర్పాటు చేయడంతో వందలాది మంది రోగులతో నిత్యం కిటకిటలాడుతున్నాయి.

ఎన్ఎంసీ నిబంధనలు బేఖాతరు

జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) నిబంధనల మేరకు వైద్య కళాశాలకు అనుబంధ ఆసుపత్రుల్లో రక్తపరీక్షల నిర్వహణ కోసం సెంట్రల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలి. మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, పెథాలజీ ఈ మూడు విభాగాలను ఒకే కేంద్రంలో ఉండేలా సెంట్రల్ ల్యాబ్‌ను రూపొందించాలి. అయితే పెద్దాసుపత్రిలో శాంపిల్స్ మాత్రం ఒకచోట సేకరిస్తూ.. ల్యాబ్‌లను వేరువేరు ప్రాంతాల్లో ఏర్పాటుచేశారు. సేకరించిన శాంపిల్స్ ఆయా ల్యాబ్‌లకు విధిగా తీసుకెళ్లాలి. అయితే ఎన్ఎంసీ నిబంధనలు విస్మరిస్తూ రక్తపరీక్షల కష్టాలను కేంద్రీకృతం చేశారని రోగులు మండిపడుతున్నారు.

త్వరలోనే సెంట్రల్ ల్యాబ్

- ప్రొఫెసర్ ఆత్మారామ్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల

ఎన్ఎంసీ నిబంధనల మేరకు సెంట్రల్ ల్యాబ్‌ను త్వరలోనే ఏర్పాటు చేయబోతున్నాం. రక్తపరీక్షల నిర్వహణ కష్టాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కింద నిధులను ఇప్పించేందుకు హామీ ఇచ్చారు. దాదాపు రూ.50లక్షల వరకు నిధులను సమకూర్చేందుకు కలెక్టర్ చొరవ చూపారు. ఆ మేరకు సెంట్రల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసేలా ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లకు ప్రతిపాదనలు పంపాం.

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య


శ్రీరాములు (ఫైల్)

ధర్మవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): అప్పులబాధతో ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు.. పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన యర్రజోడు శ్రీరాములు(56) కూలిమగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కూలిమగ్గం ద్వారా నేసిన చీరలకు గిట్టుబాటు ధర లభించలేదు. దీనికి తోడు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సుమారు రూ.10లక్షల దాకా అప్పులు చేశాడు. ఈ అప్పులు ఎలా తీర్చాలోనని కుటుంబ సభ్యులతో తరచూ చెబుతుండేవాడు. మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని అతడి భార్య అమరావతిని కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్యతోపాటు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

నాన్నా క్షమించు.. వెళ్లిపోతున్నా !

● అనారోగ్యంతో యువతి ఆత్మహత్య

సోమందేపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): 'నాన్నా..! నొప్పులు భరించలేకపోతున్నా. రోగంతో బాధపడుతూ, నిత్యం మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేక ఆత్మహత్య చేసుకుంటున్నా. అమ్మా, నాన్న అందరూ నన్ను బాగా చూసుకున్నారు. నేను వెళ్లిపోతున్నానని బాధపడవద్దు' అని రేష్మ(26) లేఖ రాసి ఆత్మహత్య చేసుకుంది. ఈఘటన సోమందేపల్లిలోని దుర్గానగర్‌లో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు కియ అనుబంధ సంస్థలో పనిచేస్తున్న ముస్తఫా స్థానిక దుర్గానగర్‌లో నివాసముంటున్నాడు. ఇతడికి భార్య ఖాసీంబీ, కుమార్తె రేష్మ, కుమారుడు ఫక్రుద్దీన్ ఉన్నారు. రేష్మ గత కొన్నేళ్లుగా రుమటైటిస్ ఆర్థరైటిస్ వ్యాధితో బాధపడుతుండేది. ఎన్ని చోట్ల వైద్యం చేయించినా వ్యాధి నయం కాలేదు. ఈక్రమంలో జీవితంపై విరక్తిచెందిన రేష్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా రేష్మ ప్రస్తుతం డీఎస్సీ పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

స్థలం కోసం గొడవ..

చేతి వేలిని కొరికేసిన వ్యక్తి

బెళుగుప్ప, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థలం కోసం గొడవపడి ఓవ్యక్తి చేతి వేలిని కొరికేసిన సంఘటన శనివారం మండలంలోని యలగలవంక తండాలో జరిగింది. గ్రామానికి చెందిన శ్రీరాముల నాయక్, చంద్రనాయక్‌ల మధ్య శుక్రవారం రాత్రి గొడవ జరిగింది. దీంతో శ్రీరాములు నాయక్ ఎడమచేతి చూపుడు వేలిని చంద్రానాయక్ కొరికేయడంతో రెండు ముక్కలైంది. కుటుంబ సభ్యులు 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. బాధితుడి భార్య సావిత్రి బాయి ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివ కేసు నమోదు చేశారు.

పెచ్చులూడిపడి విద్యార్థులకు గాయాలు


గాయపడ్డ ఓంకార్, స్టీఫెన్ జాయ్

గుంతకల్లు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలూరు రోడ్డులో నిర్వహిస్తున్న సెయింట్ పాల్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో పైకప్పు పెచ్చులు ఊడిపడి ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. పాఠశాలకు వెళ్లిన ఓంకార్, స్టీఫెన్ జాయ్ అనే విద్యార్థులపై శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పెచ్చులు ఊడి పడ్డాయి. విషయం తెలుసుకున్న ఎంఈఓ-1 మస్తాన్‌రావు పోలీసులతో కలిసి ఘటనా స్థలికి వెళ్లి గాయపడిన విద్యార్థులను ఆసుపత్రికి తరలించారు. విద్యార్థుల తలకు కుట్లు వేసిన అనంతరం ఇంటికి పంపారు. ఎంఈఓ-1 పాఠశాలకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. పాఠశాల కరస్పాండెంటు అందుబాటులో లేకపోవడంతో ఫోనులో వివరణ కోరారు. ఘటన నేపథ్యంలో పలు విద్యార్థి సంఘాలు పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించాయి.

రైతు ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాపినేపాళ్యం గ్రామానికి చెందిన వెంకటరెడ్డి అనే రైతు శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. వెంకటరెడ్డికి మరో రైతుకు గత కొంతకాలం నుంచి భూమి సమస్య ఉంది. ఈ క్రమంలోనే వెంకటరెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స అనంతపురం తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

స్థిరంగా టమోటా ధరలు

అనంతపురంరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో టమోటా ధరలు స్థిరగా కొనసాగుతున్నాయి. గత మూడు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. శనివారం కిలో రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.20, సరాసరి ధర రూ.27 పలికినట్లు చెప్పారు. మార్కెట్‌కు మొత్తంగా 3,300టన్నుల టమోటాలు వచ్చాయని అన్నారు.

దత్తారెడ్డి మెరుపు శతకం



అనంతపురం క్లాక్‌టవర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారుడు దత్తారెడ్డి మెరుపు శతకం సాధించాడు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలో జరుగుతున్న సీనియర్ వన్డే ఆంధ్రా ప్రాబబుల్స్ క్రికెట్ పోటీల్లో జిల్లా ప్లేయర్ దత్తారెడ్డి 60 బంతుల్లో 11 బౌండరీలు, 12 సిక్సర్లతో (127) అద్భుత సెంచరీ సాధించాడు. ఇప్పటికే ఇదే టోర్నీలో ఆఫ్ సెంచరీ చేసిన దత్తారెడ్డి మంచి జోరుమీదున్నాడు. మెరుపు సెంచరీ చేసిన దత్తారెడ్డిని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందించారు.

'చలో కలెక్టరేట్'కు అనుమతులు లేవు

● డీఎస్పీ విజయ్‌కుమార్

పుట్టపర్తిరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): చలో కలెక్టరేట్ ఆందోళనకు అనుమతించాలంటూ వివిధ సంఘాల నాయకులు చేసుకున్న దర ఖాస్తులను తిరస్కరిస్తున్నట్లు పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ శనివారం ఓప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్‌పై ఈనెల 28న చలో కలెక్టరేట్ ముట్టడికి అనుమతులు కోరుతూ పెట్టుకున్న దరఖాస్తును శాంతి భద్రతల దృష్ట్యా తిరస్కరించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. గిరిజనసంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసనాయక్, కటారు గంగాధర్ యాదవ్, బీసీ సంఘం, కురువసంఘం నాయకులు, మాలమహానాడు, ఎమ్మార్పీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు కలెక్టరేట్ ముట్టడి కోసం పెట్టుకున్న దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు. పటాన్ సలాంఖాన్ ముస్లిం మైనార్టీనాయకులు, నూర్‌బాషా సంఘం జిల్లా అధ్యక్షుడు విడివిడిగా మొత్తం నలుగురు దరఖాస్తులు పెట్టుకున్నారని, వాటిని తిరస్కరించామన్నారు. ధర్నాలు ఆందోళనలు చేపట్టేవారు ఆర్డీఓ కార్యాలయం వద్ద చేసుకోవచ్చన్నారు. 30 పోలీసుయాక్ట్ అమలులో ఉన్నందున వ్యక్తిగత విషయాల కోసం ఆందోళనలు చేపట్టడానికి ప్రయత్నించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

చీనీ టన్ను రూ.16వేలు

అనంతపురం రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు.

ఆంజనేయుడికి తొలి శనివారం పూజలు


నేమకల్లులో స్వామికి ప్రత్యేక అలంకరణ, కసాపురంలో శేష వాహనంపై స్వామి ప్రాకారోత్సవం


మురడిలో స్వామివారు

గుంతకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామికి శేష వాహనోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా తొలి శనివారాన్ని పురస్కరించుకుని నెట్టికంటి ఆంజనేయస్వామి మూల విరాట్‌కు వేకువనే అభిషేకాలు, స్వర్ణ కవచాలంకారాలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పఠన కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం మహా మంగళహారతి, సాయంత్రం శేష వాహనంపై సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వాములను ఆశీనులను గావించి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాలలో కసాపురం, గుంతకల్లుకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈ ఓ కె.వాణి, ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సూపరింటెండెంట్ పి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● డి.హీరేహాళ్ మండలంలోని మురడిలో ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే సుప్రభాత సేవతో పూజలనుప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామిని ప్రత్యేక పూలు, ఆభరణాలతో అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారి నరసింహారెడ్డి, గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. బాలమేధావి పాఠశాల విద్యార్థులు పాల్గొని భక్తులకు సేవలు అందించారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

● బొమ్మనహాల్ మండలంలోని నేమకల్లులో ఆంజనేయస్వామి వారికి శ్రావణమాసం తొలి శనివారం ప్రధాన అర్చకులు అనిల్ కుమార్ చార్యులు ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక, ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు.

గుప్తనిధుల ముఠా అరెస్టు

పరారీలో ముగ్గురు


గుప్తనిధుల ముఠా సభ్యులను చూపుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం/కుందుర్పి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గుప్తనిధుల తవ్వకాలు జరుపుతున్న ముఠాను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వివరాలను కళ్యాణదుర్గం రూరల్ సీఐ నీలకంఠేశ్వర రావు విలేకరులకు వెల్లడించారు. కుందుర్పి మండలంలోని రుద్రంపల్లి పరిసర ప్రాంతంలో బినల మల్లప్ప దేవాలయం వద్ద గుప్తనిధుల తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు. ఈక్రమంలో 12 మందిని అరెస్టు చేసి, ఎక్స్‌కవేటర్, రెండు కార్లు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో ముగ్గురిని కేరళ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. ఘటనా స్థలంలో లభ్యమైన మూడు ఇత్తడి వస్తువులు, ఒక ఇత్తడి గంట, తవ్వకాలకు ఉపయోగించిన గడ్డపారలు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్న ట్లు తెలిపారు. కుందుర్పి మండలం రుద్రంపల్లికి చెందిన బోయ నాగభూషణ, బోయ బొమ్మన్న, పసుపుల మంజునాథ్, అనంతపురం పట్టణానికి చెందిన సయ్యద్ అష్రూఫ్, షేక్ ఫరూక్ బాషా, తలారి సుబ్బరాయుడు, చెంచు గొల్ల వెంకటేష్, కేరళ రాష్ట్రం కొల్లాం జిల్లాకు చెందిన నజుముద్దీన్, పసులుద్దీన్, ఎస్ నౌషద్, కంబదూరు గ్రామానికి చెందిన షేక్ షఫీ, ఎస్ మహమ్మద్‌లను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. మరో ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారని వారి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు.

కార్గిల్ విజయం స్ఫూర్తిదాయకం: బీజేపీ


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు సాధించిన విజయం స్ఫూర్తిదాయకమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. కార్గిల్ విజయ్‌దివాస్‌ను పురస్కరించుకుని శనివారం బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక క్లాక్‌టవర్ నుంచి సుభాష్‌రోడ్డు మీదుగా సప్తగిరిసర్కిల్ వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. సప్తగిరి సర్కిల్‌లో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద బీజేపీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ 1999 ఫిబ్రవరిలో కశ్మీర్ ను ఆక్రమించుకునేందుకు ఆపరేషన్ బదర్ పేరిట ఉగ్ర వాదులను సరిహద్దులోకి పంపి, పాకిస్థాన్ యుద్ధానికి కాలు దువ్విందన్నారు. అప్పటి ప్రధాని వాజ్‌పేయి శాంతి చర్చలకు ఆహ్వానించినా పాకిస్థాన్ కుటిల బుద్ధితో యుద్ధం ఆరంభించిందన్నారు. 1999 మే 3 న ప్రారంభమైన యుద్ధం పాకిస్థాన్ తోకముడవడంతో జూలై 26న ముగిసిందన్నారు. భారత్ సైన్యం, అమరవీరుల జ్ఞాపకార్థంగా విజయ్‌దివస్ జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, మాజీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, బీజేపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు రత్నమయ్య, లక్ష్మీదేవి, లలిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీర సైనికుల త్యాగాలు వృథాకావు

● మైభారత్ అధికారుల నివాళి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): వీర సైనికుల త్యాగాలు వృథా కావని మై భారత్ అధికారులు పేర్కొన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని శనివారం స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాలలో కేంద్ర యువజన క్రీడా శాఖ, మైభారత్, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో యువతకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మై భారత్ అధికారులు మాట్లాడుతూ.. సైనికుల త్యాగాలు వృథా కావని, అనునిత్యం దేశ సరిహద్దులో ప్రాణాలకు తెగించి మనల్ని కంటికి రెప్పలా కాపాడుతున్నారన్నారు. 1999 జూలై 26న కాశ్మీర్‌లోని కార్గిల్ గ్రామంలో పాకిస్థాన్‌తో వీరోచితంగా పోరాడి ఎంతో మంది భారత సైనికులు తమ ప్రాణాలను త్యాగం చేసి విజయాన్ని అందించారని తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, మై భారత్ అధికారులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు జీవన్‌కుమార్, జయమారుతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తికి ఘనస్వాగతం


న్యాయమూర్తికి మొక్క అందజేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్‌రెడ్డికి జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ ఘనస్వాగతం పలికారు. ఈ మేరకు శనివారం రోడ్లు, భవనాల అతిథిగృహంలో న్యాయమూర్తిని కలిసి పూల మొక్కను అందజేశారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించిన

దేవదాయశాఖ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉరవకొండ, జూలై 26(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం ఆలయ భూములకు సంబంధించి దేవదాయశాఖ అధికారులు శనివారం క్షేత్రస్థాయికి వెళ్లి వివరాలను ఆరాతీశారు. ఆంధ్రజ్యోతిలో 'నారసింహుడికే నామాలు' అనే కథనం ప్రచురితం కావడంతో జిల్లా దేవదాయశాఖ అధికారి తిరుమలరెడ్డి, ఇన్‌స్పెక్టర్ రాణి, ఆలయంలోని భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం దేవాలయం భూములున్న మోపిడి, ఆమిద్యాల, చిన్నముష్టూరు, పెద్దముష్టూరు కోనాపురం గ్రామాల్లో సాగులో ఎవరు ఉన్నారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. దేవాలయాలకు సంబంధించి భూములు సాగుచేసుకుంటున్న సాగుదారులు కౌలు బకాయిలను వెంటనే చెల్లించాలని సూచించారు. దేవాలయ భూములను విక్రయిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఇటీవల కాలంలో దేవాలయాలకు సంబంధించిన ఉన్నతాధికారుల పర్యటనంతా గోప్యంగా ఉంచడం చర్చగా మారుతోంది. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మారుతి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.


కోనాపురంలో వివరాలను ఆరా తీస్తున్న ఏసీ

వృద్ధుల ఇంటివద్దకే రేషన్

● ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ

అనంతపురం కలెక్టరేట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వికలాంగులు, మంచానికే పరిమితమైన వారికి ఇంటివద్దకే రేషన్ పంపిణీ చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని నాయక్‌నగర్ 37వ ప్రభుత్వ రేషన్ షాపు పరిధిలో కార్డుదారుల ఇళ్లకు వెళ్లి ఇన్‌చార్జ్ కలెక్టర్ రేషన్ సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 26నుంచి 31వ తేదీలోపు సరుకుల పంపిణీ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్డుదారులందరికీ బియ్యం, చక్కెర, సరుకులు పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డీఎం రమేష్‌రెడ్డి, తహసీల్దార్ హరికుమార్, సీఎస్‌డీటీ బాష తదితరులు పాల్గొన్నారు.

సీళ్లను తస్కరించిన వైద్యుడు


సీసీ ఫుటేజీలో జూనియర్ డాక్టర్

అనంతపురం వైద్యం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో రోగులకు వైద్య సేవలందించాల్సిన డాక్టర్ చోర కళను ప్రదర్శించారు. అలాగని ఖరీదైన వస్తువులు కాజేయలేదు. సీళ్లను మాత్రమే తస్కరించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల అధికారులు తెలిపిన మేరకు.. షారుక్ అహ్మద్ అనే వ్యక్తి హోమియోపతి హౌస్ సర్జన్‌గా (జూనియర్ డాక్టర్) పని చేస్తున్నారు. ఈయన ఆస్పత్రిలోని వివిధ వైద్య విభాగాధిపతులకు సంబంధించిన సీళ్లను దొంగిలిస్తున్నారు. ఈ విషయం డాక్టర్లు, సిబ్బందికి అంతు చిక్కలేదు. దీంతో సీసీ ఫుటేజ్‌లను పరిశీలించిన అధికారులు డాక్టరే దొంగ పనులు చేస్తున్నట్లు గుర్తించారు. ఆర్ఎంఓ, జనరల్ మెడిసన్ తదితర డాక్టర్లకు చెందిన సీళ్లను దొంగలిస్తూ సీసీ ఫుటేజీల ద్వారా పట్టుపడ్డారు. దీంతో సంబంధిత జూనియర్ డాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారామ్ తెలిపారు.

594 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా

అనంతపురం అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 594 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు సరఫరా అయ్యాయని అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 24-24-0 కాంప్లెక్స్ ఎరువులు 282 మెట్రిక్ టన్నులు, 20-20-0-13 కాంప్లెక్స్ ఎరువులు 64 మెట్రిక్ టన్నులు, 9-24-24-0-3-0-6 ఎరువులు 248 మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యాయన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఏపీ మార్క్‌ఫెడ్, హోల్‌సేల్, రిటైల్ డీలర్లకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

స్కూల్‌గేమ్స్ సెక్రటరీ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం విద్య, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్‌గేమ్ సెక్రటరీ నియామకానికి సంబంధించి పీడీలు, పీఈటీల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 58 సంవత్సరాలలోపు ఉండి, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపాల్టీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పీడీలు, పీఈటీలు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఆగస్టు 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఓపెన్‌స్కూల్ అడ్మిషన్లు పెంచుదాం

అనంతపురం విద్య, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఓపెన్ స్కూల్స్‌లో పది, ఇంటర్ అడ్మిషన్లను పెంచుదామని జిల్లా విద్యాశాఖ పరీక్షల విభాగాధికారి గోవిందనాయక్ పేర్కొన్నారు. శనివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, గురుకులాల సంక్షేమ శాఖల కార్యాలయాలకు ఏసీ వెళ్లి ఆయా శాఖల అధికారులను కలిశారు. తొలుత ఓపెన్‌స్కూల్స్‌కు సంబంధించిన పోస్టర్లను ఆయా శాఖల అధికారులతో విడుదల చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓపెన్ స్కూల్స్ వాటి అడ్మిషన్లు గురించి వివరించారు. అడ్మిషన్ల పెంపునకు అన్ని శాఖలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారి, గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు, మైనార్టీ వెల్ఫేర్‌శాఖ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి, గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

వడివడిగా చేరుతున్న కృష్ణాజలాలు

బెళుగుప్ప, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆరు పంపుల ద్వారా ఎత్తిపోస్తుండటంతో రెండు రోజుల నుంచి కృష్ణ జలాలు వడివడిగా చేరుతున్నాయి. శనివారం ఇన్‌ఫ్లో 1127 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.164 టీఎంసీల నీటి నిల్వ వుందని వెల్లడించారు.

పేరూరులో రెండు డెంగీ కేసుల నమోదు

రామగిరి, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేరూరు గ్రామంలో రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. విషయం తెలిసిన వెంటనే వైద్యసిబ్బంది, అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలో లక్ష్మీ అనే బాలికకు, ముదషిర్ అనే బాలుడికి డెంగీ సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. వారికి వైద్యసేవలు అందిస్తూ గ్రామంలో మిలాథిన్ స్ప్రే చేయించి పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జయరాంనాయక్, పంచాయతీ కార్యదర్శి సత్యమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం వస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకోవాలని సూచించారు.

నలుగురు దొంగల అరెస్ట్


అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

పుట్లూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.కొండాపురం గ్రామశివారులో ఉన్న గాలిమరల సామగ్రి చోరీ కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ సత్యబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొండాపురం వద్ద కిందపడిపోయిన గాలిమరలను దొంగలించారని తెలిపారు. సమాచారం మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేయగా కళ్యాణదుర్గం మండలం వర్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్, రామగిరి మండలం పేరూరుకు చెందిన శివయ్య, కంబదూరు మండలం అచ్చెమ్మపల్లికి చెందిన అజయ్, హరికృష్ణను అరెస్ట్ చేశామన్నారు. వారివద్ద నుంచి రూ.3,47,200 నగదు, గ్యాస్ సిలిండర్, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ వెంకటనరసింహం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతలు..


వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్ఐ

అనంతపురం క్రైం, జూలై 26(ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్, ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. నిందితుల వివరాలను వన్‌టౌన్ స్టేషన్‌లో శనివారం వారు ప్రకటించారు. నగరంలోని భైరవనగర్ సర్కిల్‌లో ఆర్టీఓ ఆఫీస్ వద్ద గంజాయి అమ్ముతున్న మరువకొమ్మ కాలనీకి చెందిన కటిక మహమ్మద్ సాజిద్(22) అలియాస్ సాదిక్, ఉమానగర్‌లో నివాసం ఉండే వనం శివచరణ్(22) అలియాస్ ట్యాటూ చరణ్‌ను అరెస్టుచేశామన్నారు. వారి నుంచి కేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పాతూరు మార్కెట్‌ను పునర్నిర్మిస్తాం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్



కరపత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, ఇతర నాయకులు

అనంతపురం క్రైం, జూలై 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని పాతూరు మార్కెట్‌ను పునర్నిర్మాణం చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక 12వ డివిజన్‌లో శనివారం ఆయన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజలకు ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. అలాగే కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా నెరవేస్తున్నారన్నారు. ఇప్పటికే మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్ల ఏర్పాటు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, తల్లికి వందనం పథకాలు అమలు చేశారన్నారు. రాబోయే రోజుల్లో మిగతావాటినీ అమలు చేస్తారని తెలిపారు. అనంతపురం నగరంలో తాము ఏడాదిలోనే రూ. 118 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేశామన్నారు. అక్టోబరు 2 నాటికి డంపింగ్ యార్డులో చెత్త లేకుండా చేస్తామన్నారు. పాతూరు మార్కెట్‌ను పీపీపీ మోడల్‌లో పునర్నిర్మిస్తామని పేర్కొన్నారు. తర్వాత పరిశీలకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ....అనంతపురానికి దగ్గుపాటి వంటి ఎమ్మెల్యే చాలా అవసరం అన్నారు. నియోజకవర్గం కోసం ఎంతగానో కష్టపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో 12వ డివిజన్ కార్పొరేటర్ జనబలం బాబా, నాయకులు రంగాచారి, కరీముల్లా, బాలా, మల్లి, ప్రభాకర్, మౌలా, నాగరాజు ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బిందెల కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు

అనంతపురంరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి):మండలంలోని పాపంపేట పంచాయతీ బిందెల కాలనీలో శనివారం టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాప్తాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ సాలమ్మ తదితరులు ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సంక్షేమాన్ని, అభివృద్ధిని వివరించారు. స్థానిక 73వ బూత్ పరిధిలో ఈ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. నాయకులు రత్నమోహన్, బాబావలి, జస్వంత్ ,లక్ష్మీదేవి, గంగరత్న, లక్ష్మి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అనారోగ్య జీవనశైలితో సంతానోత్పత్తి సమస్యలు

● సంతాన సాఫల్య శిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ రాజ్యలక్ష్మి



శిబిరంలో పాల్గొన్న వైద్యురాలు, మహిళలు

అనంతపురం వైద్యం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడి, అనారోగ్య జీవనశైలితో ప్రతి ఆరుగురు మహిళల్లో ఒకరు సంతానోత్పత్తి సమస్యతో బాధపడుతున్నారని గైనకాలజిస్ట్ డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. నగరంలోని శ్రేయ హాస్పిటల్లో శనివారం ఉచిత సంతాన సాఫల్య శిబిరాన్ని నిర్వహించారు. టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి డాక్టర్ రాజ్యలక్ష్మి హాజరై పలువురు మహిళలను పరీక్షించారు. అనంతరం మాట్లాడుతూ ఇన్ వ్రిటో ఫెర్టిలైజేషన్(ఐవీఎఫ్) అనే మోడరన్ మెడికల్ టెక్నాలజీస్ పద్ధతిలో మహిళలకు సంతాన సాఫల్యతను అందిస్తున్నామన్నారు. నెలసరి క్రమంగా రాకున్నా, తరచుగా గర్భస్రావం అవుతున్నా గర్భాధారణ సమస్యలు వస్తాయన్నారు. అదేవిధంగా హార్మోన్ల లోపం, థైరాయిడ్ వంటి సమస్యలు ఇందుకు కారణమవుతున్నాయని తెలిపారు. ఫైబ్రాయిడ్స్, ఎండోమెట్రోయాసిస్, ఫెలోపియన్ ట్యూబ్స్, పీసీఓడీ తదితర బాధిత మహిళలు సంతానోత్పత్తికి దూరవుతున్నారని వివరించారు. ఈ సమస్యలతో బాధపడుతున్న మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఐయూఐ, ఐవీఎఫ్ పద్ధతుల్లో సంతాన సాఫల్యం పొందేలా చికిత్సలు చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

ఘనంగా వార్షిక మహాసభ

రామగిరి, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మహిళా శక్తి సొసైటీ ఆవరణలో శనివారం టింబక్టు సహకారంతో ప్రతిభా వికలాంగుల సొసైటీ 17వ వార్షిక మహాసభ ఘనంగా జరిగింది. ఇందులో ఉమ్మడి జిల్లా వికలాంగుల సంక్షేమశాఖ అధికారి అర్చన, టింబక్టు కలెక్టివ్‌కు చెందిన మేరీ,బబ్లూ హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్చన మాట్లాడుతూ... విభిన్న ప్రతిభావంతులకు ఏవైనా సమస్యలుంటే వికలాంగుల సంక్షేమశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే పరికరాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం వికలాంగులకు ఐదు ట్రైసైకిళ్లు, ఒక హ్యాండ్‌స్టిక్, ఒక వీల్‌చైర్ పంపిణీ చేశారు. ఏడుగురు విద్యార్థులకు రూ.82వేల పెలోషిప్ చెక్కును అందజేశారు. ప్రతిభా సొసైటీ డైరెక్టర్ రమేశ్‌కుమార్, అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షురాలు పెద్దక్క, ప్రోగ్రాం మేనేజర్ జయశ్రీ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం: వైసీపీ

అనంతపురం రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మదన్ మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తపోవనంలో బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ..కూటమి ప్రభుత్వ మోసాలను వివరించారు. ఏడాదిపాలనలో ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ లేదని మండిపడ్డారు. కేవలం ప్రచార ఆర్భాటం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●శింగనమల: మండలంలోని ఉల్లికల్లు, కొరివిపల్లి, ఉల్లికంటిపల్లి, అలంకరాయునిపేట, జూల్పాకాలువ, పి.జలాలపురం గ్రామాల్లో వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందంటూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రైతు విభాగం రాష్ట్రకార్యదర్శి తరిమెల వంశీ గోకుల్‌రెడి , నాయకులు వెంకటనారాయణ, పరంధామరెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలకు సన్మానం

రాప్తాడు, జూలై 26(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం మండలంలో వంద శాతం పూర్తి కావడంతో టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇంచార్జిలకు, బూత్ కన్వీనర్లకు మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఘన సన్మానం జరిగింది. పార్టీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి హాజరై వారిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. తొలిఅడుగు కార్యక్రమం మండలంలో వందశాతం పూర్తి కావడం అభినందనీయమన్నారు. క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలతో పాటు బూత్ కన్వీనర్లు, నాయకుల, కార్యకర్తల కృషితోనే అది సాధ్యమైందన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతిఒక్కరికీ న్యాయం చేస్తామని పేర్కొన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ చౌదరి, పార్టీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచులు తిరుపాలు, శీనయ్య, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కిష్టా, క్లస్టర్ ఇన్‌చార్జి నారాయణస్వామి, మరూరు సొసైటీ చైర్మన్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన వారితో ధర్మవరపు మురళి

మేమింతే.. రామంతే !

● పెద్దాస్పత్రిలో మారని కొందరు వైద్యుల తీరు
● ఎప్పటిలాగానే విధుల పట్ల అలసత్వం



మధ్యాహ్న ఓపీలో జనరల్ సర్జరీ పురుషుల విభాగంలో ఖాళీగా ఉన్న వైద్యుల కుర్చీలు



గైనిక్ ఓపీకి ఏకంగా తాళం వేసిన దృశ్యం



డాక్టర్ల కోసం జనరల్ సర్జరీ ఓపీలో వేచిచూస్తున్న రోగులు

అనంతపురం వైద్యం, జూలై 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కొందరి వైద్యులు విధుల పట్ల తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో వైద్యసేవలు సరిగా అందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విధుల వేళల్లో రోగులకు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని అధికారుల ఆదేశాలున్నాయి. అయితే కొందరు డాక్టర్లు వాటిని పట్టించుకోవడం లేదు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓపీ సేవలందిస్తామని ఆస్పత్రి అధికారులు ప్రకటిస్తున్నారు. అయినా సమయానికి డాక్టర్లు రావడం లేదు. మధ్యాహ్న ఓపీ సేవలకు కూడా రాకుండా మేమింతే.. సో వాట్? అన్న ధిక్కార ధోరణి ప్రదర్శిస్తున్నారు. ఓపీలో కనీసం ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ అయినా ఉండాలి. పీజీలు, హౌస్ సర్జన్‌లు మాత్రమే పరీక్షిస్తున్నారు. విధుల్లో వైద్యుల నిర్లక్ష్యం తమకు ఇబ్బంది కలిగిస్తోందని రోగులు వాపోతున్నారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేయండి

● అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న పరిటాల సునీత

అనంతపురం రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పైపులైన్ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. మండలంలోని ఉప్పరపల్లి సమీపంలో గల ఆర్డీటీ స్టేడియం వద్ద సీపీడబ్ల్యూఎస్ స్కీం పైపులైన్ మరమ్మతులకు గురైన విషయం తెలుసుకున్న ఆమె శనివారం టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి అక్కడికి చేరుకుని పరిశీలించారు. పరిస్థితిపై ఎన్‌హెచ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడారు. పైపులైన్ మరమ్మతులకు గురి కావడంతో చియ్యేడు, ఆకుతోటపల్లి, ఇటుకలపల్లి, చిన్నకుంట, కృష్ణంరెడ్డి పల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వారం రోజుల్లో పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి చేయించాలని ఆదేశించారు.

నిధుల మంజూరుపై హర్షం

రాప్తాడు: మండలంలోని భోగినేపల్లిలో చెన్నకేశవస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు దేవాదాయశాఖ నుంచి 65 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. ఇందుకు ఆ గ్రామపెద్దలు, టీడీపీ నాయకులు శనివారం రామగిరి మండలం వెంకటాపురంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసి హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరుకు చొరవ చూపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మంజూరు చేసిన సీఎం చంద్రబాబుకు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. భోగినేపల్లి సర్పంచ్ ఉజ్జినప్ప, నాయకులు నారా నారాయణ, కాటమయ్య, నాగప్ప, గొల్ల ముత్యాలప్ప, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

రామగిరి: మండలంలోని నసనకోట సమీపంలో ఉన్న ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ప్రమీల నియమితులయ్యారు. ఇంతకుముసుపు ప్రిన్సిపాల్ అమీనాబేగం డిప్యుటేషన్‌పై అన్నమయ్య జిల్లా వీలేరు పాఠశాలకు బదిలీ అయ్యారు. దీంతో ఆ స్థానంలోకి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ప్రమీల వచ్చారు. ఆమె శనివారం వెంకటాపురంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

శ్రీసాయి డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

అనంతపురంరూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కమలానగర్‌లో గల శ్రీసాయి డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఇందులో వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని సుమారు 60 మంది నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అందులో ఐదుగురు ఉద్యోగాలకు అర్హత సాధించినట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కళాశాల చైర్మన్ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ దామోదరరెడ్డి అభినందించారు. అధ్యాపకులు షెక్షావలి, జ్యోతిక, వెంకటేశులు, వెంకన్న, చలపతి పాల్గొన్నారు.

ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్ బిల్లు పెట్టాలి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రప్రభుత్వం ప్రైవేటు రంగంలో ఎస్సీ, ఎస్టీ బీసీలకు రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టాలని ఆలిండియా ఎస్సీఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ కోరారు. స్థానిక ఎస్టీఓ హోంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని 60 కోట్ల మంది ప్రజలు రోజుకు రెండు పూటలా కడుపునిండా భోజనం చేయలేని పేదరికంలో ఉన్నారని ప్రశాంత్ కిషోర్ తెలిపారని, ఈ క్రమంలో ప్రైవేటు రంగంలో కూడా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. గతేడాది కేంద్ర న్యాయ సామాజిక శాఖ మంత్రి రామదాస్ అథవాలే కూడా ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని కోరినట్లు గుర్తు చేశారు. సంఘం సభ్యులు సోమశేఖర్, సురేష్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



సత్య బ్రూస్లి

గార్లదిన్నె, జూలై 26(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో అనంతపురం జిల్లాకు చెందిన చిన్నారి తలారి సత్య బ్రూస్లి ప్రతిభ కనబరచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. శుక్రవారం విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో కృష్ణా జిల్లా తైక్వాండో అసోషియేషన్ ఆధ్వర్యంలో 10 జాతీయ ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో సబ్ జూనియర్ 16 కిలోల విభాగంలో అనంతపురం జిల్లాకు చెందిన తలారి సత్య బ్రూస్లీ ప్రతిభ కనబరచి బంగారు పథకాన్ని కైవసం చేసుకున్నాడు. ప్రతిభ కనబరచిన సత్య బ్రూస్లిని క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, అక్కడి కలెక్టర్ లక్ష్మీషా అభినందించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ దోనేపూడి శంకర్, కార్యదర్శి ఎల్. శివభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రాప్తాడు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాండ్లపర్తి గ్రామ సమీపంలో పొలంలో పేకాటకేంద్రంపై పోలీసులు శనివారం దాడులు చేశారు. అందులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు. అనంతరం వారి నుంచి రూ. 3700 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు. ఎక్కడైనా పేకాటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు రుక్మిణీ కల్యాణం

అనంతపురంటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పెళ్లి కాని యువతీయువకులకు సత్వరమే పెళ్లిల్లు కావాలనే సంకల్పంతో సాయి ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిఏటా నిర్వహించే రుక్మిణీ కల్యాణంను ఆదివారం హౌసింగ్ బోర్డులోని భక్తాంజనేయస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు గోపూజ, అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ రుక్మిణీ కల్యాణంను నిర్వహించడంతో పాటు ఎదురుకోలు ఉత్సవం జరపనున్నట్లు చెప్పారు. వివాహం కాని యువతీయువకులు, ప్రజలు విరివిగా పాల్గొనాలని కోరారు.

పైపులైన్ పనులకు భూమిపూజ

అనంతపురం రూరల్, జూలై26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచానపల్లిలో పీఏబీఆర్ తాగునీటి పైపులైన్ పనులకు టీడీపీ నాయకులు శనివారం భూమిపూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత పంచాయతీలోని గ్రామాలకు పీఏబీఆర్ నీటినందిస్తామని హామీ ఇచ్చారని, ఆ మేరకు నీటిని సరఫరా చేసేందుకు పైపులైన్ పనులు చేయిస్తున్నారని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

శింగనమల, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయనవారిపల్లి, రాచేపల్లి, శింగనమల-4 అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సీడీపీఓ లలితమ్మ శనివారం తనిఖీ చేశారు. అనంతరం శింగనమల ఐసీడీఎస్ కార్యాలయంలో పెరవలి సెక్టార్‌కు చెందిన అంగన్‌వాడీ వర్కర్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని, సమయపాలన పాటించాలని సూచించారు. లబ్ధిదారుల ముఖ చిత్రం నమోదు చేసిన తర్వాతనే పౌష్టికాహారం సరుకులను ఇవ్వాలని సూచించారు. సూపర్‌వైజర్లు నేతాజీ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

పోలేపల్లిలో వైద్యశిబిరం

రామగిరి, జూలై 26(ఆంధ్రజ్యోతి):మండలంలోని పోలేపల్లిలో శనివారం ఎమ్మెల్యే పరిటాలసునీత సూచనలతో కర్నూలుకు చెందిన అమిలియో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ప్రసాద్ దంపతులు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో గుండె, కిడ్నీలు, కంటిచూపు, ఆస్మా, ఆర్థోపెడిక్ తదితర జబ్బులకు ఉచిత వైద్యపరీక్షలు చేశారు. 20 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి కర్నూలుఅమిలియో ఆస్పత్రికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చంద్రశేఖర్, శ్రీరాములు, టీడీపీ నాయకులు ప్రభాకర్, నారాయణ, మల్లికార్జున, అక్కంపల్లి చంద్రాయుడు, దాదు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

2 నుంచి రగ్బీ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై26(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 2 నుంచి 3వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని కస్తూరి కాలేజీలో రగ్బీ క్రీడా రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కడపల శంకర్ శనివారం ప్రకటనలో తెలిపారు. రగ్బీ ఆటలో గాయపడిన క్రీడాకారులకు ప్రథమ చికిత్స, గాయాలకు ఉపశమనం , చికిత్స మెలకువలపై నిపుణులు అవగాహన కల్పిస్తారన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉండే వ్యాయామ ఉపాధ్యాయులు, పీడీలు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు తరలిరావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8897486043ను సంప్రదించాలని సూచించారు.

క్రీడల్లోనూ రాణించాలి: సీఐ

రాప్తాడు, జూలై 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటూ క్రీడల్లోనూ రాణించాలని అనంతపురం రూరల్ సీఐ శేఖర్ సూచించారు. నగరంలోని బైరవనగర్‌లో గల ప్రతిభ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే సెలెబ్రేషన్స్‌కు సీఐ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు విలువలతో కూడిన విద్య నేర్చుకోవాలన్నా రు. ఇంగ్లిష్, కంప్యూటర్ విద్యపై పట్టు సాధించాల తెలిపారు. పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఫసల్ బీమాను వినియోగించుకోండి

● ఈ నెలాఖరు వరకు గడువు
● రైతులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన

రామగిరి, జూలై 26(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. మండలంలోని వెంకటాపురంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆమె రైతులనుద్దేశించి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం రైతులను ఆపదకాలంలో ఆదుకోవాలన్న ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ప్రకృతి విపత్తులైన తుఫాను, కరువు, అకాల వర్షాలు, వరదలు వంటివి సంభవించి పంటలు నష్టపోతే బాధిత రైతులకు ఈ పథకం ఆర్థిక రక్షణ కల్పిస్తుందని తెలిపారు. బీమా సంస్థలు నష్టాన్ని అంచనా వేసి రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా 25శాతం మొత్తాన్ని జమ చేస్తాయని అన్నారు. జిల్లాలో సాగవుతున్న వరి, మొక్కజొన్న, కందులు, రాగులు, ఆముదం పంటలకు మాత్రమే ఇది వర్తిస్తుందన్నారు. ఈ పంటలకు కేవలం రూ.100 నుంచి రూ.200 వరకు మాత్రమే ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు ఏ పంటలు వేశారో స్థానికంగా వ్యవసాయాధికారులతో ధృవీకరణపత్రాన్ని తీసుకోవాల్సి ఉంటుందన్నారు. దగ్గర్లోని బ్యాంక్ బ్రాంచ్‌కి వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. లేదా వ్యవసాయ సహకారసంఘాలు, కామన్ సర్వీస్ సెంటర్లు, మీ సేవా కేంద్రాల్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. భూయాజమాన్య రికార్డులు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం జిరాక్స్‌లు, పంట ధృవీకరణ పత్రం తీసుకెళ్లి దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

పంటల బీమాతో రైతులకు మేలు

అనంతపురంరూరల్: రైతులు పంటలను బీమా చేయించుకోవడం వల్లన ఎంతో మేలు జరుగుతుందని ఏఓ వెంకటకుమార్ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా పంటల భీమా ప్రీమియం చెల్లించుటకు ఈనెల 31వతేదీ వరకు అవకాశం కల్పించిందన్నారు. ఎకరా పత్తి పంటకు రూ.1140, వేరుశనగకు రూ.640, దానిమ్మకు రూ.3,750, బత్తాయికి రూ.2,750, టమోటాకు రూ.1600, అరటికి రూ.3వేలు చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. విపత్తుల సమయంలో ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మొబైల్ ఫోన్ ద్వారా కూడా ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. ప్లేస్టోర్‌లో ఏఐడీఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని భీమా ప్రీమియం చెల్లించవచ్చున్నారు. మరిన్ని వివరాలకు 9014896363, 7989601340ను సంప్రదించాలని కోరారు.

నాగులకు విశేష పూజలు



చెరువుకట్టపై పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

అనంతపురం టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం తొలి శనివారాన్ని పురస్కరించుకుని నగరంలోని వివిధ ప్రాంతాల్లో నాగదేవతలకు విశేష పూజలు నిర్వహించారు. ప్రధానంగా చెరువు కట్టపై పుట్టల వద్దకు భక్తులు పద్దఎత్తున చేరుకుని పాలు పోసి, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఒకరికొకరు కంకణాలు కట్టుకోవడంతో పాటు ప్రసాదాలు పంపిణీ చేసుకున్నారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు

శింగనమల: శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని దిద్దికైలు ఆంజనేయస్వామి, మరవకొమ్మ ఆంజనేయస్వామి, దుర్గాంజనేయస్వామి ఆలయాలతో పాటు గంపమలయ్య కొండ మీద స్వామి వార్లను అర్చకులు ప్రత్యేక అలకంరణ చేసి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు ప్రాంతాల్లో నాగుల పుట్టలకు పాలు పోసి పూజలు చేశారు.

కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ

అనంతపురంరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌పై భారత్ విజయాన్ని ప్రతి భారతీయుడు గర్వంగా స్మరించుకుంటారని నగరంలోని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ అన్నారు. మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ దూదేకుల షేకన్న ఆధ్వర్యంలో శనివారం కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ జరిగింది. ఆర్ట్స్ కళాశాల వద్ద ర్యాలీని ప్రిన్సిపాల్ పద్మశ్రీ జెండా ఊపి ప్రారంభించారు. ఎన్టీఆర్ సర్కిల్, టవర్ క్లాక్ మీదుగా సాగిన ర్యాలీ తిరిగి కళాశాలకు చేరుకుంది. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. భారత సైనికుల ధైర్యాన్ని, త్యాగాలను దేశం గౌరవిస్తుందన్నారు. తర్వాత అమరులైన కార్గిల్ యుద్ధవీరులకు నివాళులర్పించారు. కళాశాల సిబ్బందితో పాటు మాజీ సైనికులు ఉమామహేశ్వరరావు, తిమ్మారెడ్డి, రాంగోపాల్, నాగరాజు, రవికుమార్, ఇస్మాయిల్‌షఫీ, బాలస్వామి, హుస్సేన్, అమర్నాథ్‌లాల్, మహమ్మద్ ఇషాద్, మహమ్మద్ గౌస్, కే.ఎస్‌నాయుడు, నాగిరెడ్డి, సిద్దన్న, ఎన్‌ఎస్ఎస్ కేడెట్లు పాల్గొన్నారు.

ఎరుకుల సంక్షేమ సంఘం రాష్ట్రఉపాధ్యక్షుడి నియామకం



సాకే వీరాంజనేయులు

అనంతపురంరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నగరానికి చెందిన సాకే వీరాంజనేయులు నియమితులయ్యారు. ఆమేరకు శనివారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంభ రాంబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ..తన ఎంపికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడికి, వర్కింగ్ ప్రెసిడెంట్ చిరంజీవికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

కూటమివి దిగజారుడు రాజకీయాలు: మేయర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): నగరంలో కూటమి నేతలు పోలీసులను అడ్డుపెట్టుకుని దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మేయర్ మహమ్మద్ వసీం విమర్శించారు. వైసీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి తబ్రేజ్ జన్మదినం సందర్భంగా సన్నిహితులు నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. వాటిని మేయర్ శనివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఫ్లెక్సీల విషయంలో కూడా రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని, అందరికీ సమన్యాయం చేయాలని సూచించారు.

వైభవంగా ఏడు శనివారాల వ్రతం



ఆర్‌ఎఫ్ రోడ్డు లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వ్రతం ఆచరిస్తున్న భక్తులు



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

అనంతపురం టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ఆలయాల్లో ఏడుశనివారాల వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రధానంగా ఆర్‌ఎఫ్ రోడ్డులో గల లక్ష్మీ వేంకటేశ్వర స్వామి, రామ్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి, అశోక్‌నగర్‌లోని సత్యనారాయణస్వామి ఆలయాలతో పాటు శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలో వేదపండితులు ఈ వ్రతాలను నిర్వహించారు. తొలుత ఆలయాల్లోని మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఆలయాల ఆవరణలలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులను అలంకరించి వేదమంత్రోచ్చారణల నడుమ పూజాది కైంకర్యాలు నిర్వహించారు. తర్వాత వ్రతవిశిష్టతను వివరిస్తుండగా మహిళాభక్తులు సామూహికంగా వ్రతాలను ఆచరించారు. ఆయా ఆలయాల కార్యవర్గాలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లడ్డూ పడిపూజ



స్వామివారి ముందు ఏర్పాటు చేసిన లడ్డూ పడి

అనంతపురం టౌన్, జూలై26(ఆంధ్రజ్యోతి): శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో లడ్డూ పడి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి విగ్రహం ముందు లడ్డూలను పడిగా ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భక్తులు సామూహిక కుంకుమార్చనలు చేశారు. మహామంగళహారతి నివేదనానంతరం తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, కార్యదర్శి కలవల మల్లికార్జున, కోశాధికారి చిందలూరు ప్రసాద్, ఉపాధ్యక్షుడు దేవరాజ్, జూటూరు మహేష్‌బాబు, చెన్నకేశవులు, లక్ష్మినారాయణ, చిందలూరు శివ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్



అలంకరణలో నరసింహస్వామి, బొలికొండ రంగనాథస్వామి, అమ్మవార్లు

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గుత్తి రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేటలో వెలసిన నవ అహోబిల లక్ష్మినరసింహ స్వామికి, తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా స్వామి వారికి వేకువజామున పంచామృతాభిషేకం వివిధ పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. మహామంగళ హారితినిచ్చి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా శ్రావణమాస పూజలు



పల్లకిలో ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

రాయదుర్గంరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్రవన్నూరు గ్రామ సమీపంలో వెలసిన అపులాపురం ఆంజనేయ స్వామి ఆలయం, అదే విధంగా మల్లాపురం గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం శ్రావణమాస పూజలు ఘనంగా నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో పల్లకిసేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవఅధ్యక్షుడు రామ్మూర్తిస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ నైవేద్యపూజలు నిర్వహించారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ప్రారంభం

కణేకల్లు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చిక్కణ్ణేశ్వర చెరువుకట్టపై వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. పురోహితుల సమక్షంలో బలిహరణం, కూష్మాండ బలిదానం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. ప్రసిద్ధిచెందిన నాగులకట్ట వద్ద విగ్రహాలను గ్రామస్థులు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు.

మానవాళికి మేలు చేసే పరిశోధనలు జరగాలి

గుత్తి జూలై 26(ఆంధ్రజ్యోతి): మానవాళికి మేలు చేసే పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాలని జేఎన్‌టీయూ ప్రొఫెసర్ సత్యనారాయణ సూచించారు. పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజులుగా జరుగుతున్న బయోడీగ్రేడబుల్ పాలిమర్స్ అటల్ ఎఫ్‌డీపీ కార్యక్రమం శనివారంతో ముగిసింది. కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ సుధాకర్, ఇంతియాజ్ బాషా, కో-ఆర్డినేటర్లు హరిప్రియ, కాశింబి పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

గుత్తిరూరల్, జూలై26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.యర్రగుడి గ్రామ శివారు లో నాటుసారా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ సీఐ ఉమాదేవి దాడులు చేశారు. కర్నూలు జిల్లా తుగ్గిలికి చెందిన పద్మావతి అనే మహిళ నుంచి 12 లీటర్ల నాటు సారా కర్ణాటకకు చెందిన 106 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఆమెను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ గోపాలు, సిబ్బంది వెంకటనారాయణ, వెంకటేశ్, నరసింహులు, శివయ్య పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

ఉరవకొండ, జూలై 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవిమఠం పరిసరాల్లో మట్కా ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ మహానంది తెలిపారు. గవిమఠం వద్ద మట్కా ఆడుతున్నట్లు సమాచారం రాగా పోలీసులు దాడులు చేసి ముగ్గురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.32వేలు, నాలుగు మట్కా చీటీలను, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టిన దుండగులు

బ్రహ్మసముద్రం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతే కొండాపురం పంచాయతీ సూగేపల్లి గ్రామంలో తాగునీటి బోర్లకు అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని దుండగులు పగులగొట్టారు. అందులో ఉన్న కాపర్‌వైరును దొంగలించుకుని వెళ్లినట్లు సర్పంచ్ మల్లెల వనిత మల్లికార్జున తెలియజేశారు.

చిరుత సంచారంపై భయాందోళన వద్దు

రాయదుర్గంరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): చిరుత సంచారంపై భయాందోళన చెందాల్సిన అవసరం లేదని పట్టణ ప్రజలకు ఫారెస్టు అధికారులు అవగాహన కల్పించారు. శుక్రవారం సాయంత్రం మొలకాల్మూరు రోడ్డు చెక్‌పోస్టు వెనుక కొండపై చిరుత కలకలం రేపిన నేపథ్యంలో శనివారం సాయంత్రం ఫారెస్టు డిప్యూటీ రేంజర్ దామోదర్‌రెడ్డి, బీట్ ఆ ఫీసర్ ఆంజనేయులు, సిబ్బంది పర్యటించారు.

రహదారిపై మొక్కలు నాటి నిరసన

గుత్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు 63వ జాతీయ రాహదారిలోని గుంతల్లో నిలిచిన నీటిపై డీవైఎఫ్ఐ అధ్వర్యంలో మొక్కలు నాటి నిరసన చేపట్టారు. పట్టణంలోని గాంధీ సర్కిల్ నుంచి చెరువు కట్ట వరకు రోడ్డు గుంతలమయమై వర్షాలకు గోతులలో నీరు నిలిచిపోతున్నాయన్నారు. అశోక్, ప్రశాంత్, చందూ పాల్గొన్నారు.

నిరుపయోగంగా సచివాలయ కొత్త భవనం

● పాడుబడిన ఇంట్లోనే ఉద్యోగుల విధులు



నిరుపయోగంగా సచివాలయ, ఆర్‌ఎస్‌కే నూతన భవనాలు

విడపనకల్లు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని డొనేకల్లు గ్రామంలో గ్రామ సచివాలయాన్ని ఓ పాడుబడిన ఇంట్లో నిర్వహిస్తున్నారు. ఇది ఎప్పుడు కూలుతుందోనని అందులోకి వెళ్లడానికి సిబ్బంది, ప్రజలు జంకుతున్నారు. విద్యుత్ సరఫరా కూడా సరిగా లేదు. గది మొత్తం చీకటిగా ఉంటోంది. కప్పు నుంచి మట్టి రాలుతూ ఉంటుంది. వర్షం పడినప్పుడు సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నారు. గ్రామ సచివాలయం, రైతుసేవా కేంద్రం కోసం నూతన భవనాలను రెండేళ్ల క్రితం నిర్మించారు. అయితే అధికారులు వాటిని ఉపయోగించకోకుండా నిరుపయోగంగా వదిలేశారు. అధికారులు స్పందించి పాడుబడిన ఇంటి నుంచి కొత్త భవనంలోకి సచివాలయాన్ని మార్చాలని స్థానికులు కోరుతున్నారు.



పాడుబడిన ఇంటిలో నిర్వహిస్తున్న సచివాలయం

బిల్లులు రాక: షకీలా బేగం, ఎంపీడీఓ, విడపనకల్లు

భవన నిర్మాణాలను కాంట్రాక్టర్లు పూర్తి చేసినా వాటిని సంబంధించిన బిల్లులు ఇంకా మంజూరు కాలేదు. దీంతో ఆ భవనాలను వారు అధికారులకు అప్పగించలేదు. ఆ బిల్లులు మంజూరు కాగానే కొత్త భవనంలోకి కార్యాలయాన్ని మారుస్తాం.

ప్రసాదం ముసుగులో లడ్డూ విక్రయం

● టెండర్లు వేయకుండానే అక్రమంగా విక్రయిస్తున్నవైనం

● పట్టించుకోని దేవదాయశాఖ అధికారులు



లడ్డూను విక్రయిస్తున్న వ్యాపారులు

బొమ్మనహాళ్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఆంజనేయస్వామి దేవాలయంలో అక్రమ దందాకు తెరలేపారు. అధికారుల అండతో దళారులు రెచ్చిపోతున్నారు. అందినకాడికి లడ్డూలను అడ్డదిడ్డంగా అమ్మేస్తున్నారు. శ్రావణమాసం రద్దీని దృష్టిలో ఉంచుకుని అక్రమ విక్రయాలు సాగిస్తున్నారు. మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయంలో దర్శనం కోసం వచ్చిన భక్తులు లడ్డూ ప్రసాదం కోసం ఎంత ఖర్చుచేయాడానికైనా వెనకాడరు. భక్తుల అవసరాలు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. శని, మంగళవారాల్లో వేలాది మంది భక్తులు వస్తారు. ప్రసాదం ముసుగులో అక్రమంగా లడ్డూలను విక్రయిస్తున్నారు. లడ్డూ విక్రయించాలంటే ముందుగా దేవదాయశాఖ అధికారులు అనుమతి ఇవ్వాలి. లడ్డూ విక్రయించేందకు అధికారులు వేలం పాట నిర్వహిస్తారు. వేలం పాట దక్కించుకోన్నావారు ఫూడ్ డిపార్టమెంట్ అధికారులు పరిశీలించిన తర్వాత లడ్డూలను విక్రయించాల్సి ఉంటుంది. అలా కాకుండా ఎక్కడో బయట నుంచి లడ్డూలను తెప్పించి భక్తులకు అంటగడుతున్నారు. తక్కువసైజులో రెండూ లడ్డూలను రూ.50 నుంచి రూ.100 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకోని ప్రసాదం పేరుతో విక్రయించడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రసాదం పేరుతో నాణ్యత లేని పదార్థాలను విక్రయించడం చట్టవిరుద్ధం అయితే సంబంధిత అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు లడ్డూలను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొడతాం: సీపీఐ

కళ్యాణదుర్గం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్ల సమస్యను తక్షణం పరిష్కరించాలని నివాస గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొడతామని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, సహాయ కార్యదర్శి నరసింహులు హెచ్చరించారు. శనివారం సీపీఐ పట్టణ 4వ మహాసభల సందర్భంగా టీ సర్కిల్లో జెండా ఆవిష్కరణ చేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ భవన్ ఎదురుగా పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రతినిధుల సమావేశంలో పట్టణ కార్యదర్శి ఓంకార్, బ్రహ్మసముద్రం మండల కార్యదర్శి నాగరాజునాయక్, హనుమంతు, బుడేన్, లక్ష్మీదేవితో కలిసి వారు మాట్లాడారు. అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందం తక్షణం రద్దు చేసి పెంచిన సర్దుబాటు చార్జీలను తగ్గించి నివాస గృహాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణం ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. సునీల్, నరసింహులు, సాయి, గీత, రామాంజనేయులు, రమణ, బాబు పాల్గొన్నారు. అనంతరం పట్టణ కమిటీ ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎస్ ఓంకార్, సహాయ కార్యదర్శులుగా బుడేన్, సలావుద్దీన్, ట్రెజరర్‌గా లక్ష్మీదేవి, కార్యవర్గసభ్యులు, కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అత్యవసర పనులను చేపట్టండి

గుంతకల్లు, జూలై 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వార్డుల్లో అత్యవసరంగా చేయాల్సిన పనులను వెంటనే చేపట్టాలని కౌన్సిలర్లు డిమాండ్‌చేశారు. శనివారం ఉదయం చైర్‌పర్సన్ ఎన్ భవాని అధ్యక్షతన పురపాలక సంఘ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ కౌన్సిలరు కే కృపాకర్ మాట్లాడుతూ టెండర్లు నిర్వహించినా కొన్ని అత్యవసర పనులు చేపట్టలేదన్నారు. వెంటనే వాటికి రీటెండరు నిర్వహించి ఇతరులకు పనులను అప్పగించాలని, పట్టణంలో ఆవులు, కుక్కల బెడద ఎక్కువైపోయిందన్నారు. ఆవులను వాటి యజమానులు రోడ్లపైకి వదలకుండా, కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కమిషనరు నయ్యాం అహ్మద్, కౌన్సిలర్లు అనూరాధ, గుడిపాటి ఆంజనేయులు, విద్యారాణి, రవి, ప్రభాకర్, సుధాకర్, అరుణ, అధికారులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

గుత్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లడుతూ ఓ బాలికపై 14 మంది అమానుషంగా అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేసిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలనిడిమాండ్ చేశారు. మధుసూదన్ రెడ్డి, గంగారాజు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వరలక్ష్మి పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన పెంచండి: పీడీ

బ్రహ్మసముద్రం, జూలై 26(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ నాగమణి అన్నారు. మండల కేంద్రంలోని జనని సురక్ష కార్యాలయంలో సీడీపీవో లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి పీడీతో ఎటుఉ తహసీల్దార్ సుమతి, ఎంఈఓ ఓబుళపతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పీడీ ప్రసంగిస్తూ బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. సూపర్‌వైజర్లు ఖాశీంబి, రామాంజినమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు సత్యవతి, శాంతమ్మ, కేజీబీవీ విద్యార్థులు పాల్గొన్నారు.

సేవాతత్పరుడు తలారి పరశురాముడు



మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణస్వామి

గుంతకల్లు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): టీపీఆర్ ట్రస్టు నిర్వాహకుడు, దివంగత తలారి పరశురాముడు సామాజిక సేవాతత్పరుడని టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి అన్నారు. శనివారం రాత్రి పరశురాముడి సమస్మరణ సభను ఆయన స్వగృహంలో నిర్వహించారు. పాల్గొన్న నారాయణ స్వామి, సీఐ గుణశేఖర్ మాట్లాడుతూ పిన్నవయసులోనే కసాపురంలో లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ నిర్మాణాన్ని చేపట్టి విజయవంతంగా పూర్తిచేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సింగిల్ విండో చైర్మన్ తలారి మస్తానప్ప, సరోజమ్మ, రామలింగ, నాగరాజు, వీఆర్వో కృష్ణ, శకుంతలమ్మ, శివ, తేజ, రాజు పాల్గొన్నారు.

వినాయకచవితిని కలిసికట్టుగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

తాడిపత్రి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను అందరూ కలిసికట్టుగా హిందూ సంప్రదాయ పద్ధతిలో జరుపుకుందాం అని వీహెచ్‌పీ నాయకుడు రాధాకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక నివాసంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వినాయకచవితి పండుగ అంటే అందరికి ఆమోదయోగ్యమైన తొలి పండుగ అన్నారు. వినాయక నిమజ్జనం రోజు శుద్ధపౌడర్ చల్లుతూ మద్యం సేవిస్తూ ఊరేగింపులో అశ్లీల నృత్యాలను చేస్తూ సమాజానికి విరుద్ధంగా కొందరు ప్రవర్తిస్తున్నారన్నారు. ప్రతి వినాయక మండపం నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించి మంచి మార్గాన నడిచేవిధంగా చూడాలన్నారు. నరసింహారెడ్డి, లక్ష్మీనారాయణ, రాజారెడ్డి, నారాయణస్వామి, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

తాడిపత్రి, జూలై 26(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ అన్నారు. రూ.40లక్షలు ఖర్చుచేసి పైప్‌లైన్ ప్రారంభించినట్లు తెలిపారు. గన్నెవారిపల్లికాలనీ, పీర్లచావిడి ఏరియా, గౌసియామసీదు, షిర్డిసాయిబాబా ఆలయ సమీపంలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉండడంతో ఆ ప్రాంతానికి శాశ్వత పరిష్కారం చూపినట్లు తెలిపారు. గతంలో రెండు ఇంచుల పైపులు ఉండడంతో కాలనీలో చాలా మందికి నీరు చేరకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. వాటిని తొలగించి ఐదు ఇంచుల పైపులైను వేస్తున్నారు. పలుకాలనీల్లో ఆయన పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట చింబిలి ప్రసాద్‌నాయుడు, రాంబాబు, రాము, హస్సన్, సత్య, నటరాజు, సుధాకర్ ఉన్నారు.

విద్యార్థులు మంచి నడవడికను అలవర్చుకోవాలి

రాయదుర్గం రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థిదశ నుంచే మంచి నడవడికను అలవర్చుకోవాలని ఎస్ఐ ప్రసాద్‌బాబు సూచించారు. శనివారం పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలలో రాయదుర్గం సర్కిల్ శక్తిటీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్ఐ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వీరేష్, శక్తిటీం ఏఎస్ఐ విజయ్, హెడ్ కానిస్టేబుల్ నజీర్, అధ్యాపకుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

గుంతకల్లు, జూలై 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతున్న దశలోనే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఎస్కేపీ డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ ఏ లక్ష్మయ్య పేర్కొన్నారు. రాజనీతి శాస్త్రం-పరిపాలనా పరిణామం అనే అంశాలపై శనివారం కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ధర్మవరం కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు గోపాల్‌నాయక్ ముఖ్య వక్తగా హాజయ్యారు. వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, అధ్యాపకుడు గోపీ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.


రెగ్యులర్ తహసీల్దారును నియమించండి

విడపనకల్లు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలానికి రెగ్యులర్ తాహసీల్దారును నియమించాలని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తాహసీల్దారు కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ వన్‌బీ అడంగల్, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ సర్టిఫికెట్ కోసం నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. రెగ్యులర్ తాహసీల్దారును నియమించి ప్రజల కష్టాలు తీర్చాలన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు సర్పంచ్ సీతారాములు ఎంపిక

ఉరవకొండ,జూలై26(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు వ్యాసాపురం సర్పంచ్ సీతారాములు ఎంపికయ్యారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కృష్ణతేజ ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్రం నుంచి 10 మంది సర్పంచులు వేడుకల్లో పాల్గొననున్నారు. అనంతపురం జిల్లా నుంచి సర్పంచ్ సీతారాములు పాల్గొంటారు.

సైనికుల సేవలు ఎనలేనివి



కళ్యాణదుర్గంలో మాజీ సైనికులను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి జూన్ 26(ఆంధ్రజ్యోతి): దేశం కోసం సైనికులు చేస్తున్న సేవలు విలువైనవి అని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా అన్నారు. పట్టణంలోని గుత్తికోట పురవాస్తు శాఖ కార్యాలయంలో కోట సంరక్షణ సమితి అధ్వర్యంలో శనివారం కార్గిల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ సైనికులను సన్మానించి మెమెంటోలు అందించారు. జిల్లా పురావాస్తు శాఖ అధికారి యోగేష్, కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ్‌భాస్కర్ చౌదరి, ప్రధానోపాధ్యాయుడు సుబాన్, ఏఎస్ఐ మాణిక్యం, మాజీ సైనికుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు రామ్మూర్తి, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

యాడికి: కార్గిల్ అమరవీరుల త్యాగఫలం వెలకట్టలేనిదని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సూర్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక ఆదర్శపాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. కార్గిల్ యుద్ధం జరిగిన తీరును విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ ఉషారాణి, లయన్స్‌క్లబ్ సభ్యులు కులశేఖర్‌రెడ్డి, రమానాథ్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులను శనివారం పట్టణంలోని పార్వతీ నగర్‌లో ఉన్న మాజీ సైనికుల సంఘం కార్యాలయంలో సత్కరించారు. సంఘం అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ మాజీ సైనికుల సమస్యలను ఏవిధంగా పరిష్కరించుకోవాలో అవగాహన కల్పించారు. జిల్లా ఉపాధ్యక్షుడు దత్తయ్య, ప్రాంగణ స్వామి, శ్రీనివాసమూర్తి, రామాంజనేయరెడ్డి, ఉమాపతి, సైనిక్ బోర్డు ఆఫీసర్ తిమ్మప్ప పాల్గొన్నారు.

గుంతకల్లు: స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం విజయ్‌దివస్ ర్యాలీని నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ మనోహర్ పట్టణంలోని రైల్వే గ్రౌండు వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పట్టణ ప్రధాన రహదారి గుండా విద్యార్థులచే కార్గిల్ యోధులకు శ్లాఘిస్తూ నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ కొనసాగింది. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నరు ఇల్లూరు గోపాల కృష్ణ, క్లబ్ గుంతకల్లు అధ్యక్షుడు ఖాజా గరీబ్ నవాజ్, సభ్యులు రాము, రంగస్వామి, జగన్నాథ్, దినేశ్, విజయ్ భాస్కర్, వేల్పూరి గోపి పాల్గొన్నారు.



కురువళ్లిలో కరపత్రాలు అందజేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

వైసీపీ వికృత చర్యలను ఖండించాలి: విప్

బొమ్మనహాళ్, జూలై 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ వికృత చర్యలను అందరూ ఖండించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని కురువళ్లి, చంద్రగిరి గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో తుంగభద్ర ప్రాజెక్టు వైస్ చైర్మన్ కేశవరెడ్డితో కలిసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. వైసీపీ చర్యలతో రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారని అన్నారు. టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, పయ్యావుల మోహన్, పయ్యావుల నాగరాజు, మహేంద్ర, తిప్పేస్వామి, ధనంజయరెడ్డి, చంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మంజు పాల్గొన్నారు.

ప్రతి పేదోడి ఇంటికి సంక్షేమ పథకం

రాయదుర్గం: చంద్రబాబు నాయకత్వంలో ప్రతి పేదోడి ఇంటికి ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా ఆర్థిక చేయూత అందుతోందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఆయన 20, 21 వార్డుల్లోని పైతోట, మొలకాల్మూరురోడ్డు ప్రాంతాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు.

టీడీపీతోనే సామాజిక భద్రత: ఎమ్మెల్యే జయరాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, జూలై 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ పాలనలోనే పేద, బడుగు వర్గాలకు సామాజిక భద్రత సాధ్యమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. శనివారం ఉదయం పట్టణంలోని 12వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే స్థానిక ప్రజలతో మాట్లాడుతూ పింఛను మొత్తాలను భారీగా పెంచిన చరిత్ర చంద్రబాబు నాయుడుకు సొంతమన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో సమగ్ర సంక్షేమం సాధ్యపడుతుందన్నారు. గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, పాల మల్లికార్జున, పత్తి హిమబిందు, హనుమంతు, రామన్న చౌదరి, కే శివన్న, అంజి, రాయల్ వెంకటేశులు, కే సురేశ్, వీరేశ్, చిప్పగిరి ప్రతాప్ పాల్గొన్నారు.

రస్తా విషయంలో దాడి... ఒకరికి గాయాలు

గుంతకల్లు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రప్పాబాడులో పొలానికి రస్తా విషయంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో మధు అనే వ్యక్తి గాయపడ్డాడు. గ్రామానికి చెందిన గోవిందు, రామాంజినమ్మ, అజయ్, రాజమోహన్ తనపై కొడవలితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని బాధితుడు మధు తెలిపాడు. గాయపడిన మధును గుంతకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మధు బంధువులైన సూరి, హేమలత, ప్రమీలమ్మ గాయాలు అయినట్లు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అల్యూమినియం స్వాధీనం

ఉరవకొండ, జూలై 26(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న అల్యూమినియంను వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పట్టుకున్నారు. కళ్యాణదుర్గం డిపోకు చెందిన బస్సులో హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఉరవకొండ డిపో ప్రాంగణంలో అందిన సమాచారం మేరకు అధికారులు బస్సులో సోదాలు చేశారు. బస్సు డిక్కీలో 20 బస్తాలు కరిగించిన అల్యూమినియం ఉన్నట్లు గుర్తించారు. వివరాలను వెల్లడించేందుకు డీసీటీవో సురేష్ నిరాకరించారు.

చెట్టును ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

కూడేరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్కూరు గ్రామ సమీపంలో అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారి పక్కనున్న చెట్టును కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. స్థానికులు, పోలీసులు అందించిన వివరాల మేరకు శనివారం రైల్వే కొండాపురానికి చెందిన నాగసుబ్బారెడ్డి, విజయభాస్కర్‌నాయుడు, నరసింహనాయుడు, మరొకరు కలిసి వివాహానికి హాజరయ్యేందుకు బళ్లారికి కారులో వెళ్తున్నారు. రాత్రి సమయం కావడంతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీ కొనడంతో నాగసుబ్బారెడ్డి, విజయభాస్కర్‌నాయుడులకు గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం 108లో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు

కూడేరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌సీసీ నగర్‌లో 6వ ఆంధ్ర బాలికల బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి అన్నారు. శనివారం క్యాంపులో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. అనంతరం ఫైరింగ్ శిక్షణ పొందిన విద్యార్థులను అభినందించారు. ఆయనతోపాటు ఇంద్రబహదూర్ ఉన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోండి

గుత్తి, జూలై26(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏడీఏ వెంకటరాముడు సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయ డివిజన్ కార్యలయంలో ఐదు మండలాల వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఏఓలు ముస్తాక్ అహ్మద్, మహబుబ్‌బాషా పాల్గొన్నారు.